ఈనాడు అనంతపురం

ప్రజాదర్బార్‌లో సమస్యలకే తొలి ప్రాధాన్యం



మంత్రి కేశవ్‌కు వినతిపత్రం అందిస్తున్న తెదేపా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలకే రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇచ్చిందని, ఆ దిశగా సమస్యలు పరిష్కారానికి చొరవ చూపుతామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం రహదారుల, భవనాలశాఖ అతిథి గృహంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు, నాయకులు, ఉద్యోగులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మొత్తం 500 పైచిలుకు అర్జీలు అందాయి. రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల నుంచి భూ సమస్యలపైనే అత్యధికంగా వచ్చాయి. ఆ తర్వాత బదిలీలపై ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. పలు గ్రామాల ప్రజలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు ఆలస్యం కాకుండా తక్షణమే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

చెరువులకు నీరివ్వండి

ఆజాద్‌నగర్: జిల్లాలోని ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లోని చెరువులకు నీరివ్వాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ కోరారు. ఆదివారం అనంతపురంలోని ప్రజాదర్బార్‌లో మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హంద్రీనీవా నుంచి కృష్ణజలాలను తరలించే రాగులపాడు పంప్ హౌస్ వద్ద కాలువలకు నీరందించే పథకానికి 2017లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పామిడి బహిరంగ సభలో రైతులకు హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో జరిగింది. 117 జీవో రద్దు చేసి ప్రతి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలు పునరుద్ధరించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. చిత్రలేఖన ఉపాధ్యాయులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. శాసన మండలి ఎన్నికల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని తీర్మానం చేశారు.

అంచనాల తయారీలో అలసత్వం

- ఊసేలేని హంద్రీనీవా విస్తరణ.. లైనింగ్ పనుల ప్రతిపాదనలు
- ప్రభుత్వం ఆదేశించినా స్పందించని జలవనరులశాఖ ఇంజినీర్లు





రెండో దశ హంద్రీనీవా ప్రధాన కాలువ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: గడిచిన ఐదేళ్లు వైకాపా సర్కార్ జిల్లా నీటి ప్రాజెక్టులను అటకెక్కించింది. నయాపైసా నిధులు ఇవ్వలేదు. దీని మూలంగా ఇంజినీర్లలో నిస్తేజం ఆలుముకుంది. ప్రస్తుత తెదేపా కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు మాసాల పాలనలో ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా దృష్టి సారించింది. హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ పనులకు వారం రోజుల్లో తగిన అంచనాలు సిద్ధం చేయాలని ఈనెల 2న రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల సమీక్షలో రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్ స్పష్టంగా ఆదేశించారు. గడువు ముగిసి రెండు వారాలు గడిచినా అతీగతీలేదు.

కృష్ణమ్మ పరవళ్లపై ఆశలు

వరద సీజన్‌లో శ్రీశైలం జలాశయం నుంచి 120 రోజులపాటు కనీసం 40 టీఎంసీలు ఎత్తిపోసేలా హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టును రూపకల్పన చేశారు. ప్రధాన కాలువ నీటి సామర్థ్యం 3,850 క్యూసెక్కులు. కానీ, గరిష్ఠంగా 2,200 క్యూసెక్కులకు మించి ఎత్తిపోసే పరిస్థితి లేదు. కాలువ పటిష్ఠత, సామర్థ్యం తక్కువ ఉండటమే దీనికి కారణం. దీన్ని గ్రహించిన కూటమి ప్రభుత్వం వచ్చే వేసవిలో తొలి దశ కాలువ వెడల్పు (విస్తరణ), రెండో దశ కాలువను లైనింగ్ చేయాలని నిర్ణయించారు. తద్వారా వచ్చే నీటి సీజన్ నాటికి పనులు పూర్తి చేస్తే.. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుకుంటూ అనంత దిశగా పరుగులు తీస్తుందని అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.

వారంలోపు తయారు చేస్తాం

హంద్రీనీవా ప్రధాన కాలువకు సంబంధించి విస్తరణ, లైనింగ్ పనులపై తగిన అంచనాలు తయారు చేస్తున్నాం. బదిలీలు, చేరికలు.. వంటి పనుల కారణంగా కొంత ఆలస్యమైంది. వచ్చే వారంలో తగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తాం.

- నాగరాజు, సీఈ, జిల్లా జలవనరుల శాఖ

నిర్లక్ష్యం వీడేదెప్పుడు?

అనంత జిల్లాలో తొలి దశ ప్రధాన కాలువ 143 కి.మీ. వద్ద మొదలు కానుంది. అక్కడి నుంచి జీడిపల్లి జలాశయం దాకా 216 కి.మీ. వరకు తొలి దశ పూర్తి అవుతుంది. ఈ మధ్య దూరం ఉన్న 73 కిలోమీటర్లు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో 274 కి.మీ. మేర పొడవు ఉంది. ఈ మేరకు కాలువలో లైనింగ్ చేయాలి. సీమ జిల్లాల పరిధిలో మొత్తం ప్రధాన కాలువ పొడవు 565 కి.మీ. ఉంటే.. ఒక్క ఉమ్మడి అనంత జిల్లాలోనే 347 కి.మీ. మేర ప్రధాన కాలువ ఉండటం విశేషం. ప్రస్తుతం హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి పనులు జరగడం లేదు. అంటే ఇంజినీర్లకు తగిన పనులు లేనట్లే. అయినా.. కాలువ విస్తరణ, లైనింగ్ పనుల అంచనాల తయారీపై అలసత్వం చూపడం జిల్లా తాగు, సాగునీటికి నష్టం. ప్రస్తుతం కాలువ 10 మీటర్ల వెడల్పు ఉంది. దీన్ని 19 మీటర్లకు పెంచుతూ అంచనాలు తయారు చేయాలి.

ఇక్కడ నత్తనడక: ఏప్రిల్ తర్వాత నీటి సీజన్ ముగియగానే హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ పనులు మొదలు పెట్టడానికి ఆగమేఘాలపై తగిన 'అంచనా'లను తయారీ చేసి పంపాలంటూ రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి ఉన్నత స్థాయి అధికారుల సమీక్షలో అనంత అధికారులకు నిర్దేశించారు. ఇచ్చిన వారం గడువు తీరిపోయి రెండు వారాలైంది. ఇప్పటికీ అంచనాల తయారీ అతీగతీలేదు.

అక్కడ వేగవంతం: ఇదే హంద్రీనీవా ప్రధాన కాలువకు సంబంధించి సర్కిల్-1 పరిధిలో కర్నూలు జిల్లా ఇంజినీర్లు నిర్దేశిత గడువులోపు అంచనాలను తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. 0-79, 79-144, 143-216 కి.మీ. దాకా మూడు ప్యాకేజీలుగా విభజించి అంచనాలు తయారు చేశారు. కాలువ విస్తరణ కోసం రూ.830 కోట్లు అవుతుందన్న ప్రాథమిక అంచనాలను ప్రభుత్వానికి నివేదించారు.

వెనుకబడిన ప్రాంతాల నుంచే సాహిత్యం పుట్టుక



శాంతినారాయణ నుంచి పురస్కారం అందుకుంటున్న రాజేశ్వరరావు

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: రాయలసీమ ప్రాంతం వెనుకబడిన ప్రాంతం కావడంతో ఈ ప్రాంతం నుంచే గొప్ప సాహిత్యం పుట్టుకొస్తుందని పలువురు గుర్తు చేసుకున్నారు. ఆదివారం అనంతపురంలో విమలా స్మారక విమలాశాంతి కవితా పురస్కార ప్రధానోత్సవం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు చెందిన రాజేశ్వరరావుకు ప్రదానం చేశారు. ఆయన రచించిన అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి కవితా సంపుటికి ఈ పురస్కారం అందించారు. గ్రహీతకు రూ.10 వేల నగదుతో పాటు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శాంతి నారాయణ, విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధానాచార్యులు స్వరూపరాణి పాల్గొన్నారు.

యార్డుల ఆదాయం పెంపునకు ప్రత్యేక చర్యలు

ఉమ్మడి జిల్లాకు విజిలెన్సు కమిటీల నియామకం



మిల్లులో వ్యాపారులతో మాట్లాడుతున్న ఏడీఎం సత్యనారాయణచౌదరి, కమిటీ సభ్యులు

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్ యార్డుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా మార్కెటింగ్‌శాఖ చర్యలు చేపట్టింది. ఏటా యార్డుల్లో నిర్దేశించిన రుసుం వసూళ్లు తగ్గడమే ప్రధాన కారణం. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒక్కో జిల్లాకు ఒక్కో విజిలెన్సు కమిటీని నియమించింది. కమిటీలో ఐదుగురు చొప్పున సభ్యులను నియమించింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు వేర్వేరుగా కమిటీలను నియమించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 17 వ్యవసాయ మార్కెట్ యార్డులున్నాయి. అందులో అనంతపురం జిల్లాలో 9, శ్రీసత్యసాయి జిల్లాలో 8 చొప్పున ఉన్నాయి. వ్యాపారులు కొత్త లైసెన్సులు తీసుకోకపోవడం, పాత లైసెన్సుదారులు బకాయిలు చెల్లించకపోవడం, సంతల్లో ఆదాయం తగ్గడం, రిటర్న్సు చూపకపోవడం, తదితర వాటిపై కమిటీలు పర్యవేక్షిస్తాయి. ఆయా జిల్లాల్లోని మిల్లులు, వ్యాపారులు, సంతలు, బకాయిలున్న వ్యాపారులందరిపై నిఘా ఉంచాలని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అనంతపురం: జిల్లా మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకుడు సత్యనారాయణచౌదరి ఆధ్వర్యంలో విజిలెన్సు కమిటీని ఏర్పాటు చేశారు. సభ్యులుగా అనంతపురం ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు, రాప్తాడు, తాడిపత్రి, శింగనమల కార్యదర్శులు రాంప్రసాద్‌రావు, ఆనంద, కేదార్‌నాథ్ ఉన్నారు.

శ్రీసత్యసాయి: జిల్లాలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి నరసింహామూర్తి ఆధ్వర్యంలో విజిలెన్సు కమిటీని నియమించారు. సభ్యులుగా కదిరి, మడకశిర, పెనుకొండ కార్యదర్శులు జగదీశ్, నాగేంద్ర, వెంకటేశ్, హిందూపురం యార్డు సూపర్‌వైజర్ కిశోర్‌లను నియమించారు.

భక్తుల హృదయాల్లో కొలువైన సత్యసాయి

ఘనంగా అవతార దినోత్సవం



మంగళవాద్య కచేరి

పుట్టపర్తి: సత్యసాయి భౌతికంగా మన మధ్య లేకున్నా.. ప్రపంచ మానవాళి హృదయాల్లో కొలువై ఉన్నారని సాయి విద్యా సంస్థల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తిలోని సాయికుల్వంత్ మందిరంలో సాయి విద్యా సంస్థల పూర్వ విద్యార్థులు యజుర్వేద మందిరం నుంచి చిత్రపటాన్ని ఊరేగిస్తూ.. వేదాలు పఠిస్తూ.. పూర్ణ కుంభంతో మందిరానికి చేరుకున్నారు. సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవాన్ని ప్రారంభించారు. ఉరవకొండలో సత్యనారాయణరాజు 9వ తరగతి విద్యాభ్యాసం చేస్తూ, 14వ ఏటా 1940 అక్టోబరు 20వ తేదీన తనకు తాను సత్యసాయి బాబాగా ప్రకటించిన విషయం విధితమే. మహాసమాధిని వివిధ రంగుల పుష్పాలతో అలంకరించారు. ప్రపంచ మానవాళికి సత్యసాయి అందించిన ప్రేమ, ఆధ్యాత్మిక సందేశం, సేవా మార్గంలో పయనించాలని.. సత్యసాయి చూపిన బాటలో నడిచి మార్గదర్శకులు కావాలని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతపురం క్యాంపస్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బ్రాస్ బ్యాండ్‌తో సంగీత కచేరి నిర్వహించారు. విద్యార్థులు, భక్తులు సంయుక్తంగా సాయి భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పిలో వాల్మీకి మహర్షి నూతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.2 లక్షలు విరాళం అందించారు. ఈ నగదును ఆయన మేనల్లుడు ధర్మతేజ ఆదివారం వాల్మీకి సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కుందుర్పి తెదేపా పట్టణ కన్వీనర్ రంగనాథ, నాయకులు బసప్ప, నారాయణప్ప, ఓబులేసు, టీచర్ బీసీ తిమ్మప్ప, మద్రిస్వామి, బాలు, వెంకటేశు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలను కాపాడుకుందాం..!

మూడోసారి యాత్ర చేపట్టిన ప్రదీప్



ముదిగుబ్బలో సైకిల్‌పై వెళ్తున్న ప్రదీప్

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం అనంతపురానికి చెందిన యువకుడు ప్రదీప్‌ను కదిలించాయి. గిట్టుబాటుకాక సేద్యం వదిలి పెయింటర్‌గా తన తండ్రి మారడంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రపంచానికి చాటి అన్నదాతలను కాపాడుకోవాలని అడుగేశాడు. రైతు సమస్యలను దేశమంతా తెలియజేసి.. పాలకుల్లో కదలిక తేవాలని 'సేవ్ ఫార్మర్' అనే నినాదంతో మూడోసారి ఆల్‌ఇండియా సైకిల్‌యాత్ర ఆదివారం ప్రారంభించాడు. అనంతపురంలో పిల్లిగుండ్ల కాలనీకి చెందిన పెయింటర్ నాగభూషణ, పుష్పలత కుమారుడు ప్రదీప్ నిత్యం రైతుల సంక్షేమం గురించి ఆలోచిస్తున్నాడు. రెండెకరాలు పొలం ఉన్న నాగభూషణ సేద్యం చేసి అప్పులపాలై కాడెను వదిలేశారు. ఈ విధంగానే చాలా మంది రైతులు సేద్యం వదిలేసి పట్టణాలకు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. దీన్ని గుర్తించిన ప్రదీప్ రైతులను కాపాడుకోవాలని.. అందుకు తను చేతనైనది చేయాలని ఇంటర్మీడియట్ చదువుతుండగానే 'సేవ్ ఫార్మర్' నినాదంతో చేతిలో ఒక్కరూపాయి లేకుండానే పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. 2021లో అనంతపురం నుంచి కన్యాకుమారి అక్కడ్నుంచి జమ్మూ కశ్మీర్, లద్దాక్ వరకు మొత్తం 18 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశాడు. కన్యాకుమారి దగ్గర వెళ్లే టప్పుడు కాళ్లు బొబ్బలు వచ్చినా పాదయాత్ర ఆపలేదు. ఏడాదిన్నర కాలంపాటు నడిచాడు. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు కూడా ప్రదీప్‌ను కదిలించేలా చేసింది. 2022లో 'సేవ్ ఫార్మర్స్ - సేవ్ గర్ల్స్' నినాదంతో అనంతపురం నుంచి నేపాల్ దేశ సరిహద్దు వరకు 6 వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశాడు. 'నో ఫార్మర్స్-నో ఫుడ్.. సేవ్ ఫార్మర్స్, సేవ్ గర్ల్స్' నినాదాన్ని మరింత బలంగా పాలకులకు వినిపించాలనే ఉద్దేశంతో ప్రస్తుతం మూడోసారి సైకిల్ యాత్రకు శ్రీకారంచుట్టాడు. ఈ నెల 20న అనంతపురం నుంచి చైనా సరిహద్దుకు సుమారు 12 వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేయాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నాడు. ఆదివారం అనంతపురం ఉదయం నుంచి ప్రారంభించిన ప్రదీప్ సైకిల్ యాత్ర సాయంత్రానికి కదిరికి చేరుకుంది. అతనికి బ్యాంకు ఉద్యోగి అయిన మేనమామ శ్రీనివాసులు ప్రోత్సాహం అందిస్తున్నారు.

భవన సముదాయాలు సమకూర్చుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్



తాత్కాలిక భవన సముదాయాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, ఏడీజే కె.శైలజ, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం కోర్టు నిర్వహణకు తాత్కాలిక భవన సముదాయాలను త్వరగా సమకూర్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సూచించారు. ఆదివారం జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితాలక్ష్మి, సెకెండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ సుకుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌లతో కలిసి ప్రధాన న్యాయమూర్తి స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశమయ్యారు. తాత్కాలికంగా కోర్టుల నిర్వహణకు అందుబాటులో ఉన్న భవనాల గురించి చర్చించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో దెబ్బతిన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భవనం, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి భవన సముదాయాలను పరిశీలించారు. తాత్కాలిక కోర్టుల నిర్వహణకు పాత రెవెన్యూ కార్యాలయం, పశువైద్యశాల ఆవరణలో ఉన్న భవనం, రైతు శిక్షణ కేంద్ర భవనాలను పరిశీలించారు. కోర్టు నిర్వహణకు అనువైన భవనాల ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరగా తీసుకొస్తే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేశ్, సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి, ఏపీపీ ఇందాద్, రంగారెడ్డి, సుదర్శన్, సిద్దు, నాగరాజరెడ్డి సదాశివరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రవీంద్ర, మురళి పాల్గొన్నారు.

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి స్థానిక ఉపకారాగారాన్ని ఆదివారం తనిఖీ చేశారు. విధి నిర్వహణలో గార్డ్ హరినాథ్, నిర్లక్ష్యంగా ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జైలు అధికారి అంజినాయక్ ఉదాసీనతపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి విశేష అర్చనలు, అభిషేకాలు, పాలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయంలోని యాగమండపంలో రాహు, కేతు, సర్పదోష నివారణ హోమాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం స్వామి వారికి పల్లకీసేవను చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, ఆత్మకూరు**


ఉపాధ్యాయులకు నేటి నుంచి శిక్షణ

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు బోధించే ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని ఉపాధ్యాయులకు బుక్కరాయ సముద్రం సమీపంలోని విజయభారతి డీఈడీ కళాశాలలో రెసిడెన్సియల్ శిక్షణ ఇవ్వనున్నారు. అనంత జిల్లాలో 1,442 మంది, కర్నూలు జిల్లాలో 1200 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. మొత్తం ఉపాధ్యాయులను 12 బృందాలుగా విభజించారు. మొదటి బృందంలో 250 మందికి 6 రోజుల శిక్షణ ఉంటుంది. ఆ తరువాత వారంలో 250 మందికి చొప్పున శిక్షణ ఇవ్వనున్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పేరుతో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షా ఏపీసీ నాగరాజు తెలిపారు.

అక్రమార్కుల కన్నుపడితే..

చింతవనాలు కనుమరుగే

- రూ.కోట్ల విలువైన స్థలాలు కబ్జా
- పంచాయతీల ఆదాయానికి గండి



తొండపాడులో ఉనికి కోల్పోతున్న చింత వనం



శింగనమలలో చెట్లను కొట్టేయడంతో ఇలా..

గుత్తి, తాడిపత్రి, శింగనమల, పామిడి, పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చేందుకు ఏర్పాటు చేసిన చింత చెట్ల వనాలు (తోపులు) అంతరించిపోతున్నాయి. ఫలితంగా రూ.కోట్లు విలువైన వనాలను కొందరు కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడుతూ ఆక్రమణదారులకు హక్కులు కల్పిస్తూ పట్టాలిస్తున్నారు. పలుచోట్ల వనాలు కనుమరుగవుతున్నాయి. వాస్తవానికి చింత వనాల నుంచి వచ్చే ఫలసాయంతో ఏటా బహిరంగ వేలాలు నిర్వహించి ఆ సొమ్మును పంచాయతీల ఖజానాకు జమ చేయాలి. తద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు సర్పంచులు, కార్యదర్శులు పాటుపడాల్సి ఉంది. ఎక్కడా వేలాలు వేయడం లేదు. రూ.లక్షల విలువైన ఫలసాయం పరులపాలవుతోంది.

రూ.కోట్లు ఖర్చు చేసినా ఫలితమేదీ?

గుత్తి, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో చింత తోపులు అంతరించిపోతున్నాయి. చింత, తాటిచెట్లను కొందరు స్వార్థపరులు తొలగిస్తూ యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. గుంతకల్లు, పామిడి మండలాల్లో తోపులు పూర్తిగా కనుమరుగయ్యాయి. గుత్తి, పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి, శింగనమల మండలాల్లోని తోపులను స్వార్థపరులు నాశనం చేస్తున్నారు. 18 ఏళ్ల కిందట జిల్లా కలెక్టర్‌గా ఉన్న సోమేశ్‌కుమార్ ప్రభుత్వ భూములను గుర్తించి చింత మొక్కలు నాటించారు. మొక్కలకు నీరు పోసేందుకు రూ.కోట్లలో ఖర్చు చేశారు. మూడు నియోజకవర్గాల్లో మొక్కలు నాటి పెంచేందుకు రూ.30 కోట్లు ఖర్చు పెట్టారు. ఇప్పుడు వాటి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.

యథేచ్ఛగా ఆక్రమణల పర్వం

- వెంగన్నపల్లిలో 5 ఎకరాల్లో చింతతోపును పెంచారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి తన కుటుంబీకులతో కలిసి మట్టి, ఇసుక కోసం ఆ భూమిలో తవ్వకాలు చేట్టారు. చెట్లన్నీ నాశమయ్యాయి. ఆస్థలంలో చెట్నేపల్లికి చెందిన ఓ వ్యక్తి తనపేరున 5 ఎకరాల భూమిని దక్కించుకున్నాడు. రెవెన్యూ అధికారులతో పట్టా మంజూరు చేయించుకున్నాడు.
- గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామంలోని సర్వేనంబర్ 143-3లోని 4.72 ఎకరాల్లోని చింతతోపు భూమిని తమ సొంతం చేసుకునేందుకు ఇద్దరు వ్యక్తులు పోటీపడుతున్నారు. 5 నెలల కిందట వైకాపా ప్రభుత్వం చేపట్టిన భూ పంపిణీలో పట్టాలు పొందాలని రెవెన్యూ అధికారులకు పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నారు.
- గుత్తి పురపాలిక పరిధిలోని చెట్నేపల్లిలో సుమారు 20 ఎకరాల్లో చింత తోపు లుండగా అధికారుల పర్యవేక్షణ కొరవడిపోవడంతో కొందరు నాశనం చేశారు. రెండేళ్ల కిందట రెవెన్యూ అధికారులు జగనన్న కాలనీ కోసం ప్రజలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ప్రస్తుతం కాలనీ ఏర్పాటైంది. తోపు ఆనవాళ్లు లేకుండాపోయింది.
- పెద్దవడుగూరు మండలంలోని తెలికి గ్రామంలో సుమారు 5 ఎకరాల్లో చింత తోపు పూర్వం నుంచి ఉండగా చెట్లను కొందరు కొట్టేశారు. ఆ ఖాళీ భూమిని ఓవ్యక్తి ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నాడు. రూ.కోట్లు విలువైన భూమి అన్యాక్రాంతమైంది.
- యాడికి మండలంలోని తూట్రాళ్లపల్లి, కమలపాడు, తాడిపత్రి మండలంలోని అమళ్లదిన్నె, తిమ్మనచెరువు గ్రామాల్లో అరకొరగా తోపులున్నాయి. మిగిలిన గ్రామాల్లో అంతరించిపోయాయి.

మండలం	గ్రామం	తోపుల విస్తీర్ణం (ఎకరాల్లో)
గుత్తి	తొండపాడు	10
గుత్తి	మాముడూరు	05
శింగనమల	మరువకొమ్మ	01.30
తాడిపత్రి	అమళ్లదిన్నె	11
	తిమ్మనచెరువు	

స్థలాల పరిరక్షణకు చర్యలు

తోపులు ఎక్కడెక్కడున్నాయో పరిశీలిస్తాం. తోపుల్లో ఫలసాయానికి వేలాలు నిర్వహిస్తాం. ఇప్పటి వరకు వేలాలు నిర్వహించలేకపోతున్నాం. తోపుల స్థితిగతులను పరిశీలించాల్సి ఉంది. విలువైన స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.

- శివారెడ్డి, ఈవోఆర్డీ, గుత్తి

సుబ్రహ్మణ్యేశ్వరుడి కోవెలలో వసతుల కరవు

ఆదాయమున్నా.. నిత్యం సమస్యలేనా?


ఆలయం ముందు నిలిపిన వాహనాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారం ప్రసిద్ధి చెందిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సరైన వసతులు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన ఆలయాల్లో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఒకటి. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకకు చెందిన భక్తులు స్వామి దర్శనానికి పెద్దఎత్తున వస్తుంటారు. భక్తులకు వసతులు కల్పించడంలో దేవదాయ శాఖాధికారులు విఫలమవుతున్నారు. ప్రధానంగా ఆది, మంగళవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. శ్రావణం, మాఘ, కార్తిక మాసాల్లో నెలకు కనీసం 15వేల మందికిపైగా భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. ఆలయం అభివృద్ధి చెందక ముందున్న రహదారినే నేటికీ వినియోగిస్తున్నారు.

- వారానికి భక్తుల తాకిడి: 6వేల మంది
- ఆలయ ఆదాయం: ఏడాదికి రూ.60 లక్షలు పైగా
- హుండీ లెక్కింపు ఆదాయం: రూ.12 లక్షలు (3 నెలలకోసారి)
- నెలకు వెచ్చించే ఖర్చు: రూ.50 వేలు (పూజారులు, సిబ్బందికి వేతనం)

దాతల సాయంతో

దాతల సాయంతో ఆగిపోయిన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. వాహనాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి పార్కింగ్ వ్యవస్థను నిర్వహించేందుకు వేలం నిర్వహించి నామమాత్రంగా రుసుం వసూలు చేస్తాం. భక్తులకు సౌకర్యాలను మెరుగుపరుస్తాం.

- బాబు, ఆలయ నిర్వహణాధికారి, పంపనూరు

ఆగిన రోడ్డు పనులు

పదేళ్ల కిందట ఆలయంలోకి తక్కువ వాహనాలు వచ్చేవి. నేడు కనీసం 200 వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. దూరప్రాంతాల నుంచి వాహనాల్లో వస్తే పార్కింగ్ కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దారులు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు వెళ్లేందుకు వీలులేదు. పెనుకొండకు చెందిన ఓ భక్తుడు లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకూ రెండంచెల రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించాడు. మట్టి రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే ఒకచోట స్థలం సమస్య రావడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో దాతలు వెనక్కి వెళ్లిపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాలను ఆలయ ఆవరణంలో పార్కింగ్ చేయకుండా ప్రత్యేక స్థలంలో చేసేలా ఏర్పాటు చేయాల్సి ఉంది.


వాహనాలు వెళ్లే దారిలో వ్యాపారాలు

చెస్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురంలో ఆదివారం ఆంధ్రా చెస్ అసోసియేషన్, ఆధ్వర్యంలో స్పార్టెన్స్ అకాడమి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెస్ ఓపెన్ అండర్ 13 ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 23 మంది క్రీడాకారులు పాల్గొనగా పలువురు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా చెస్ కార్యదర్శి నాగార్జున, టోర్నమెంట్ డైరెక్టర్ ఆరీపుల్లా తెలిపారు. ఓపెన్ విభాగంలో ప్రథమ స్థానంలో మహేన్‌పెద్దన్న, ద్వితీయ స్థానంలో మిథున్‌పెద్దన్న, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో జ్ఞానికారెడ్డి, ద్వితీయ స్థానంలో రక్షిత ప్రతిభ కనబరిచినట్లు వివరించారు. వీరిలో టాప్-2 గా నిలిచిన వారు నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.


జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

కొత్తగా ఆలోచిద్దాం.. నైపుణ్యాలు పంచుకుందాం

యాప్ రూపొందించిన ఉరవకొండ యువకుడు


యాప్‌లో వివరాలు పరిశీలిస్తున్న నూర్

ఉరవకొండ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికితీయాలి. వాటిని అందరూ పంచుకోవాలని ఉరవకొండకు చెందిన నూర్ అనే యువకుడు సరికొత్తగా ఆలోచించారు. క్లాస్ ఫ్లస్ వారి సహకారంతో 'టైగర్ టెస్ట్ అకాడమీ యాప్' రూపొందించారు. అందులో ప్రత్యేక దినోత్సవాలు, చేతిరాత, చిత్రలేఖనం, వ్యాసరచన, మొక్కల పెంపకం, స్నేహితులతో ఆడుకోవడం, ఆన్‌లైన్ పరీక్షలు రాయడం, వివిధ పాఠ్యాంశాల్లో ప్రాజెక్టులను తయారు చేయడం వంటి పూర్తి సమాచారాన్ని (స్టడీ మెటీరియల్) నమోదు చేశారు. విద్యార్థులు వాటిని చదువుకుని తమకు ఆసక్తి ఉన్న అంశంపై ఇంటి వద్ద నుంచే పోటీలో పాల్గొనవచ్చు. ఉదాహరణకు.. చిత్రలేఖనంలో ఆసక్తి ఉంటే చిత్రం గీసి, ఆ ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వ్యాసరచన అయితే నచ్చిన అంశాన్ని రాసి అప్‌లోడ్ చేయాలి. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న ఏ అంశంలోనైనా నైపుణ్యాన్ని పంచుకోవచ్చు. వాటిని పరిశీలించి ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు పంపుతారు.

1,113 మంది విద్యార్థులు..

టైగర్ టెస్ట్ అకాడమీ యాప్‌ను ప్లేస్టోర్‌లో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అందులో విద్యార్థి పేరు నమోదు చేయాలి. యాప్‌లో చాట్స్‌పై క్లిక్ చేసి పోటీకి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన 1,113 మంది విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పంచుకున్నారు. ఈ యాప్ ద్వారా పాఠ్యాంశాలతో పాటు వివిధ పోటీలకు సంబంధించిన అంశాలను ఫ్లెక్సీ డిజైన్ ద్వారా అందుబాటులోకి తేవాలని నూర్ ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని రూపొందించారు. చాలా డిజైన్‌లు తయారు చేయాలన్నది అతని లక్ష్యం. అందుకు ఎక్కువ సమయం, ఖర్చు అవుతుంది. దాతలు ప్రోత్సహిస్తే ఆ దిశగా ప్రయత్నిస్తానని చెబుతున్నారు.

అభివృద్ధికి అడ్డుపడితే తరిమికొడతాం: సునీత

రాంనగర్, న్యూస్‌టుడే: అభివృద్ధికి కలిసి వస్తే కలుపుకొని పోతాం.. అడ్డు తగిలితే ఊరుకునే ప్రసక్తే లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం అనంతపురం గ్రామీణ ఆలుమూరులో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైకాపా హయాంలో అదనుకు రోడ్లు కూడా వేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయన్నారు. గ్రామాల్లో అభివృద్ధి చేయాలని ఐంకెరు చేస్తే జీర్ణించుకోలేక అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అర్హత ఉన్నవారికి పింఛన్లు ఇవ్వకుండా దర్జాగా కార్లు, పెద్ద పెద్ద బంగ్లాల్లో ఉన్న వారికి వైకాపా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసి పంచారని ఆరోపించారు. అనర్హులను ఏరివేసి అర్హులందరికీ కూటమి ప్రభుత్వం పింఛన్లు ఇస్తామన్నారు. అలమూరులో రూ.20 లక్షలతో సీసీ రహదారి పనులు ప్రారంభించామని ఆమె తెలిపారు.


సీసీ రహదారి పనులు ప్రారంభిస్తున్న సునీత

23న ఎరువులు, విత్తన డీలర్ల కార్యవర్గం ఎన్నిక

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : ఈ నెల 23న ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో డీలర్ల సమస్యలు చర్చించడంతో పాటు నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లంతా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీ ఉద్యోగాల తాత్కాలిక జాబితా విడుదల

ఎస్కేయూ, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాలు ఇటీవల పరిశీలించారు. వాటికి సంబంధించిన తాత్కాలిక మెరిట్ జాబితా ఆదివారం విడుదల చేశారు. ఈ జాబితా సమగ్రశిక్ష ఏటీపీ.బ్లాగ్‌స్పాట్.కాం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 21న సాయంత్రం 4 గంటలలోపు సమగ్రశిక్షా కార్యాలయంలో తెలియజేవచ్చని ఏపీసీ నాగరాజు తెలిపారు.

నేటి నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. అమరుల సేవలను కొనియాడుతూ ఈ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేలా జిల్లా పోలీసుశాఖ సిద్ధమైంది. ఎస్పీ జగదీశ్ పర్యవేక్షణలో ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధుల్లో వారోత్సవాలు నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసుల్ని గుర్తు చేసుకోవడం, సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాల గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే వారోత్సవాల ఉద్దేశ్యం. అనంతపురం జిల్లాలో గత అక్టోబరు 21 నుంచి ఈ నెల 21 వరకు 12 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 21న స్మృతి కవాతు, అమరులకు నివాళి, 22న అమరవీరుల గ్రామాల సందర్శన, సేవలను వివరించడం, 24 నుంచి 27 వరకు చర్చావేదికలు, వ్యాసరచన పోటీలు, 26న పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శన, 26 నుంచి 27 వరకు వివిధ ఆయుధాల ప్రదర్శన, 28న వైద్యశిబిరాలు, రక్తదాన కార్యక్రమాలు, 28 నుంచి 30 వరకు పోలీసు వాద్య బృందాల ప్రదర్శనలు నిర్వహిస్తారు.


జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్మారక చిహ్నం

అమర వీరులు వీరే: హెచ్. గోవిందప్ప (రాప్తాడు), బి.సురేశ్ (కళ్యాణదుర్గం టౌన్), డి.శ్రీరామ్ నాయక్ (జిల్లా ఏఆర్), ఎన్.సుంకన్న (పీసీఆర్, ఏటీపీ), డి.రాజశేఖర్ (ఏఆర్), డి.హాజీపీరా (ఏఆర్), వి.శ్రీనివాసులు (అనంతపురం త్రీటౌన్), వి.నాగప్ప, సి.చెన్నప్ప, ఎన్.ఆంజనేయులు.

ఊడుతున్న పెచ్చులు

కంగారుగా విధులు


పెచ్చులూడిన పైకప్పు


బాత్‌రూంలో వర్షపు నీరు

అనంతపురం వ్యవసాయ సబ్ డివిజన్ సొంత భవనం లేదు. జిల్లా ఎరువులు, పురుగు మందుల పరీక్ష కేంద్రంలోని పాత భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. వర్షంతో పాతబడిన ప్రభుత్వ కార్యాలయాలు కారుతున్నాయి. ఏడీఏ ఛాంబర్ పీఏవో అంతా చెమ్మ దిగింది. వరండాలోని పైకప్పు నిత్యం తడిసి పెచ్చులూడి కిందపడుతున్నాయి. ఉద్యోగులు, సిబ్బందితో భయాందోళన చెందుతున్నారు. బాత్‌రూం పైకప్పుంతా పెచ్చులూడటంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు భయంగా వెళ్లాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, రాంనగర్ (అనంతపురం)

సాగునీటికి నిధులు కేటాయించాలి

సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై నేడు (సోమవారం) కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ధర్నాకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ హాజరవుతారని వెల్లడించారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాంభూపాల్ మాట్లాడారు. ఈ నెల 15 నుంచి 19వరకు ఐదు రోజులపాటు సాగునీటి ప్రాజెక్టులను బస్సు యాత్ర ద్వారా సీపీఎం పార్టీ బృందం పరిశీలించిందన్నారు. బీటీపీ, మిడ్‌పెన్నార్, జీడిపల్లి, సుబ్బరాయసాగర్‌లు కనీస నిర్వహణకు నోచుకోలేదన్నారు. తమ బృందం 803 కిలోమీటర్లు 24 మండలాల్లో పర్యటించామన్నారు. నాయకులు నల్లప్ప, నాగేంద్రకుమార్, సావిత్రి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.4.22 లక్షలు

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో ఆదాయం మళ్లీ పుంజుకుంది. గత వారం సంతల్లో దసరా పండుగతో ఆదాయం తగ్గింది. ఈ వారం మళ్లీ పెరిగింది. గత వారం మొత్తం రూ.3,45,200 ఆదాయం వచ్చింది. ఈ వారం మొత్తం రూ.4,22,740కు పెరిగింది. అందులో గొర్రెలు, మేకల సంతలో రూ.2,23,550 ఆదాయం రాగా, పశువుల సంతలో రూ.1,99,190 ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

సీజీ ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు

తనకల్లు, న్యూస్‌టుడే : ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా చెన్నరాయస్వామి గుడి (సీజీ) ప్రాజెక్టు నిండినందున ఆదివారం రాత్రి గేట్లు ఎత్తినట్లు అధికారులు తెలిపారు. సీజీ ప్రాజెక్టు పరిసర గ్రామాల వాసులు, పాపాఘ్నినది పరివాహక ప్రాంత ప్రజలు, టి.సదుం గ్రామ ప్రజలు ప్రాజెక్టు వైపునకు వెళ్లొద్దని సూచించారు. గేట్లు ఎత్తుతున్నందున ఆ ప్రాంత ప్రజలను నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. ఒక గేటును ఎత్తి అడుగుమేర నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు. ఇన్‌ఫ్లోను బట్టి నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రనేల కొట్టాలలో మహిళ హత్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధి ఎర్రనేల కొట్టాలలో ఒంటరి మహిళను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. శెట్టూరు మండలం కరిడిపల్లికి చెందిన నాగమ్మ(52) ఎర్రనేల కొట్టాలలో రామకృష్ణకు చెందిన ఇంట్లో పై అంతస్తులో ఓ గదిలో నివశిస్తోంది. ఈమె సైఫుల్లా వంతెన సమీపాన లక్ష్మీ ఇడ్లీ సెంటర్‌లో పనిచేస్తోంది. ఉదయం ఐదున్నర గంటలకు హోటల్‌కు వెళ్లి, తిరిగి మధ్యాహ్నం పన్నెండు గంటలకు గదికి వచ్చేది. ఆదివారం ఎంతసేపటికీ రాకపోవడంతో.. హోటల్ యజమాని సురేంద్రబాబు ఇంటి యజమానికి ఫోన్ చేశాడు. ఆయన మేడపైకి వెళ్లి తలుపులు మూసి ఉండటం గమనించారు. పిలిచినా పలకకపోవడంతో తలుపులు తెరిచి చూడగా నాగమ్మ మంచంపై నిర్జీవంగా పడి ఉండటం చూసి త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం ముఖంపైన, మంచంపైన పలుచోట్ల కారంపొడి చల్లిన ఆనవాళ్లు ఉన్నాయి. ఎస్పీ జగదీశ్, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, త్రీటౌన్ సీఐ శాంతిలాల్, ఫోర్త్ టౌన్ సీఐ సాయినాథ్‌లతో కలిసి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఇంటి యజమానిని పలు వివరాలు ఆరా తీశారు. జాగిలంతో పరిసరాలను పరిశీలించి, క్లూస్ టీంతో ఆధారాలను సేకరించారు. కేసు నమోదు అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేయడం వల్లే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రత్యేక బలగాలతో గాలింపు చర్యలు చేపడుతున్నారు.


స్థానికులతో వివరాలు ఆరా తీస్తున్న ఎస్పీ జగదీశ్


నాగమ్మ

- మృతురాలిది కళ్యాణదుర్గం మండలం ఉప్పొంక గ్రామం. శెట్టూరు మండల కరిడిపల్లికి చెందిన నాగప్పతో వివాహమైంది. వీరి కుమారులు వీరేశ్, సందీప్ కుమార్తె మల్లమ్మ ఉన్నారు. భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. నాగమ్మ ఇరవై ఏళ్ల క్రితం భర్త నుంచి విడిపోయింది. పదేళ్ల క్రితం అనంతపురానికి వచ్చింది. ఎర్రనేల కొట్టాలలో ఉంటూ హోటళ్లలో పనిచేస్తూ ఒంటరిగా ఉండేది.

తనయుడి చేతిలో తండ్రి హతం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణంలోని సిద్ధేశ్వర కాలనీకి చెందిన బొమ్మన్న(51)ను కన్న కుమారుడు దారుణంగా హత్య చేశాడు. తన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని అందరిని నమ్మించే ప్రయత్నం చేశాడు. పోలీసుల విచారణలో అసలు విషయం బయటపడటంతో కటకటాల పాలయ్యాడు. పోలీసులు, బంధువుల వివరాల మేరకు.. బొమ్మన్న, శివమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాలతో తండ్రి, కుమారుడు నాగరాజు తరచూ గొడవ పడేవారు. కోడలు ఆశా ప్రవర్తన సరిగా లేదని ఆయన మందలించారు. దాంతో శనివారం ఉదయం తండ్రి, కుమారుడు ఇద్దరూ ఇంట్లో ఘర్షణ పడ్డారు. ఆ తర్వాత బొమ్మన్న సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం పెదారగుడ్డం గ్రామంలోని వ్యవసాయ తోటకు వెళ్లారు. సాయంత్రం ద్విచక్ర వాహనంలో తన బంధువు సురేశ్‌తో కలిసి వస్తుండగా, మల్లాపురం తండా సమీపంలోని మెచ్చిరి రోడ్డులో కుమారుడు నాగరాజు తన స్నేహితుడు పబ్జీతో కలిసి స్కూటీలో ఎదురుపడ్డారు. అక్కడ ఇద్దరూ గొడవ పడ్డారు. కుమారుడు వెంట తెచ్చుకున్న కొడవలితో తండ్రిని నరికాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. తన తండ్రి రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు చెప్పాడు. అయితే నాగరాజు బళ్లారిలో ఉన్న తన చెల్లి శైలజకు వాట్సాప్ కాల్ చేసి తండ్రిని చంపుతానని చెప్పాడని, ఆమె వద్దని వారించినా వినకుండా ఈ దురాగతానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. పోలీసులు నాగరాజుతోపాటు అతని స్నేహితుడు పబ్జీని అదుపులోకి తీసుకొని విచారించగా, నేరం అంగీకరించాడు. తల్లి ఫిర్యాదు మేరకు సీఐ జయనాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


బొమ్మన్న

ఆనందం.. అంతలోనే విషాదం

- బస్సు, ద్విచక్రవాహనం ఢీ.. ఇద్దరి దుర్మరణం
- కేశఖండనకు వెళ్లి వస్తుండగా ఘటన

> అప్పటి వరకు సంబరంగా గడిపిన ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. అనుకోని విధంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కుటుంబాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరైన ఆనందం అంతలోనే ఆవిరైపోయింది. మృతుల్లో ఒకరు తొమ్మిదేళ్ల బాలుడు ఉండటం అందర్నీ కలచి వేసింది. మాటలతో అందర్నీ మురిపించే కుమారుడు ఇక రాడని తెలిసి కన్నోళ్లు రోదించిన తీరు వర్ణనాతీతం. ఇదే ప్రమాదంలో గాయపడిన బాలుడి తల్లి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతోంది.

తాడిపత్రి, న్యూస్‌టుడే : యాడికిలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన చరణ్‌రాజ్ కుటుంబం, అదే కాలనీలో ఉన్న అతని సోదరి సుమిత్ర, బావ రాముడు కారు, ద్విచక్రవాహనంపై బంధువుల్లో ఓ బాలుడి కేశఖండన మహోత్సవానికి ఆదివారం నార్పల మండలం మద్దలపల్లికి బయలుదేరి వెళ్లారు. చరణ్‌రాజ్ కార్యక్రమాన్ని ముగించుకొని అతని భార్య మనీషా ద్విచక్రవాహనం, అతని సోదరి కుటుంబం, తల్లిదండ్రులు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. తాడిపత్రిలోకి రాగానే సుమిత్ర దంపతుల కుమారుడు లక్ష్మీరామ్ మామ చరణ్‌రాజ్ ద్విచక్రవాహనంలో వెళ్తానని మొండికేయడంతో ఎక్కించారు. అక్కడి నుంచి యాడికి బయలుదేరగా చుక్కలూరు గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనింది. ఈ ఘటనలో చరణ్‌రాజ్(30), లక్ష్మీరామ్(9) అక్కడికక్కడే మృతి చెందగా మనీషాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం పెద్దాసుపత్రికి తీసుకెళ్లారు. చరణ్‌రాజ్ స్వగ్రామం నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బిజినవేముల కాగా ఐదేళ్ల కిందట యాడికిలో స్థిరపడ్డారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.


చరణ్‌రాజ్


లక్ష్మీరామ్



ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

పుట్లూరు, న్యూస్‌టుడే : పుట్లూరు మండల పరిధిలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలిక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. పుట్లూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాలిక అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ ఏడాది చదువుతోంది. ఇటీవల దసరా పండగ సెలవులకు ఇంటికి వచ్చింది. గణితంలో విద్యార్థిని వెనకబడి ఉండటంతో తీవ్ర మనోవేదనకు గురైంది. సెలవులు పూర్తవడంతో కళాశాలకు వెళ్లడం ఇష్టంలేక ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పడి రైతు, ఆవు మృతి

హిందూపురం: హిందూపురం గ్రామీణ మండలం పోచనపల్లిలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పోచనపల్లికి చెందిన లక్ష్మయ్య(65)తోపాటు పాడి ఆవు మృతిచెందింది. ఆదివారం ఉదయం లక్ష్మయ్య పాడి ఆవును మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వెంటనే సమీపంలోని చెట్టు వద్దకు వెళ్లగా అక్కడ పిడుగుపడింది. రాత్రయినా రైతు ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా ఈ ఘటన వెలుగుచూసింది. హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవటంతో పొలాల్లో మొక్కజొన్న, మిరప పంట దెబ్బతిన్నాయి. హిందూపురం గ్రామీణ మండలం సవనపల్లి చెరువు మరువ నీరు హిందూపురం - తూముకుంట రహదారిపై పెద్దఎత్తున ప్రవహించటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి దాదాపు కిలోమీటరు వరకు వాహనాలు నిలిచాయి.

నూనె మిల్లులో అగ్నిప్రమాదం

రాప్తాడు: రాప్తాడు మండలం మైనార్టీ కాలనీ పరిధిలోని శ్రీగణేష్ ట్రేడర్స్ గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. బుక్కపట్నం మండలం కృష్ణాపురానికి చెందిన మాధవనాయుడు శిల్పా లేపాక్షినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇతనికి చెందిన ఆయిల్ మిల్లులో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మిల్లు నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రం వారికి తెలిపారు. మిల్లులో ఆయిల్, వేరుసెనగ ప్యాకెట్లు, చెక్క, మిషనరీ పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినా అప్పటికే నష్టం జరిగిపోయింది. అనంతపురం జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. బాధితుడు మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చేపలవేటకు వెళ్లి మృత్యువాత

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : కదిరి మండలం ముత్యాలచెరువుకు చెందిన బయ్యప్ప (54) చేపలవేటకు వెళ్లి మృత్యువాత పడ్డారు. గ్రామస్థులు, బాధితుని కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు. ముత్యాలచెరువు వద్ద హిందూపురం రోడ్డులో టీ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న బయ్యప్ప శనివారం రాత్రి గ్రామానికి సమీపంలోని కానుగలకుంటలో చేపల పట్టేందుకు వెళ్లారు. ఆదివారం ఉదయం వరకూ ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు కుంట వద్దకు వెళ్లగా అతను మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. వల విసిరే సమయంలో నీటిలో మునిగి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపారు.


బయ్యప్ప

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ప్రగతి పథంలో ఎల్ఐసీ సేవలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ఎల్ఐసీ సంస్థ సేవలు గతేడాది కంటే ఈ ఏడాది 25శాతం ప్రగతిలో ముందంజలో ఉన్నాయని ఆ సంస్థ కళ్యాణదుర్గం బ్రాంచి మేనేజర్ షమీవుల్లా తెలిపారు. ఆదివారం తుమాటి హనుమంతరాయుడు నివాసంలో ఎల్ఐసీ ఏజెంట్లతో మేనేజర్ సమావేశం అయ్యారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం బ్రాంచుల పరిధిలో 32ఏళ్ల నుంచి ఎవరూ సాధించలేని ఎండీఆర్‌టీ నంబర్ ఫిషను తుమాటి హనుమంతరాయుడు సాధించారని బ్రాంచ్ మేనేజర్ అభినందించారు. ఈ సందర్భంగా దంపతులిద్దరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ అభివృద్ధి అధికారి శ్రీనివాసబాబు, ఎల్ఏఎస్ఏ ఏజెంట్ ప్రతినిధులు నాగరాజు, బాషా, చంద్రశేఖర్, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాహితీ లోకానికి వరం జానమద్ది

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: జిల్లా సాహితీ లోకానికి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి వరం లాంటి వారని, ఆయన తెలుగు భాషా సాహిత్యాల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని, సీపీ బ్రౌన్ పేరిట స్మారక గ్రంథాలయాన్ని నిర్మించడానికి అహర్నిశలు శ్రమించారని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పుడి కృష్ణమోహన్ పేర్కొన్నారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలు, గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గంధ్యాలి దత్తాత్రేయ శర్మలకు గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కారాలు ప్రదానం చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

విడపనకల్లు(ఉరవకొండ), న్యూస్‌టుడే: మండలంలోని పొలికి గ్రామంలో మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల ఆధ్వర్యంలో తెదేపా నాయకులు ఓ ప్రముఖ ఆసుపత్రి సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. గుండె జబ్బు ఉన్న వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, గుండె పోటుకు గురికాకుండా ఎలాంటి అలవాట్లు కలిగి ఉండాలన్న విషయాలను శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. పలువురుని ఎన్టీఆర్ వైద్య సేవ కింద శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వైద్యులు నాగరాజు, అరవింద్‌ను స్థానికులు సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీనివాస చౌదరి, భాస్కర్, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి


ఉరవకొండ, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెదేపా మండల కన్వీనర్ విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి మోపిడి గోవింద పేర్కొన్నారు. మండలంలోని మోపిడి, షేక్షానుపల్లి గ్రామాల్లో ఆదివారం పల్లెపండగ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామాల్లో వారు అధికారులతో కలిసి సిమెంటు దారుల నిర్మాణ పనులను పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధి పథకం సాంకేతిక సహాయకుడు రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఆర్డీఓ వినూత్న తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు.

కుక్కలున్నాయ్.. పిక్కలు భద్రం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మేజర్ పంచాయతీలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయపెడుతున్నాయి. పిల్లలు, పెద్దలు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. జనం బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. పట్టణంలో దాదాపు 2వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లోనూ వాటి సంతతి పెరుగుతోంది. అవి గుంపులుగా ప్రధాన దారులు, వీధుల్లో సంచరిస్తున్నాయి. పాదచారులపై దాడులకు పాల్పడుతున్నాయి. ద్విచక్ర వాహనాల అంచుకు వచ్చి గట్టిగా అరుస్తూ వెంట పడుతున్నాయి. రాత్రివేళ ఒకరిద్దరూ నడుచుకుంటూ వెళ్తుంటే వెంబడిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,060 మంది కుక్క కాటుకు గురయ్యారు. వారిలో పురుషులు 472 మంది, మహిళలు 201 మంది, బాలురు 236 మంది, బాలికలు 83 మంది ఉన్నారు.



నియంత్రణపై చర్యలేవీ?

కుక్కల సంచారాన్ని నియంత్రించే దిశగా అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కనీసం వాటి సంతానాన్ని తగ్గించే చర్యలు తీసుకోవడం. అవి కాటేస్తే రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయించే దిశగా పంచాయతీ అధికారులు చొరవ చూపింది లేదు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల సంచారాన్ని నివారించే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఉరవకొండలోని ప్రధాన రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: కుందుర్పి మండలంలోని మలయనపల్లిలో తాగునీటి ట్యాంకు వద్ద మురుగు నిల్వ చేరి అపరిశుభ్రంగా ఉంది. **- గంగాధర**

సమాధానం: శుభ్రం చేయిస్తాం. **- రఫీ, (గ్రామ కార్యదర్శి, అలిలేపల్లి)**

సమస్య: తెనగల్లు ప్రాథమిక పాఠశాల ప్రహరీ పక్కనే మురుగు ప్రవహిస్తుంది, తొలగించాలి. **- ఆంజనేయులు, తెనగల్లు**

సమాధానం: మురుగు చేరకుండా చర్యలు తీసుకుంటాం. **- రఘు, (గ్రామ కార్యదర్శి)**

సమస్య: మండల కేంద్రంలోని పాత వ్యవసాయ కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. **- రైతులు**

సమాధానం: మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. **- మహేశ్, మండల వ్యవసాయాధికారి, కుందుర్పి - న్యూస్‌టుడే, కుందుర్పి**

సమస్య: రాయదుర్గం పట్టణంలోని రైతు సేవా కేంద్రం ముందు గుంతలో నీరు నిలిచి ఇబ్బందిగా ఉంది. **- రాజు, సానికుడు**

సమాధానం: నీటిని తొలగిస్తాం. **- రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: రాయదుర్గం పోలీస్ స్టేషన్ ప్రహరీ కూలడంతో విషపురుగులు వస్తున్నాయి. మరమ్మతులు చేయాలి. **- తిప్పేస్వామి, లక్ష్మీబజారు**

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. **- బాలరాజు, ఎస్ఐ, రాయదుర్గం**

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉరవకొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఉరవకొండ మండలం రేణుమాకులపల్లికి చెందిన తెదేపా నాయకులు దేవినేని రణధీర్, భాస్కర్ తదితరులు ఆదివారం అనంతపురంలో కలిశారు. గ్రామంలో సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తూ కరోనా సమయంలో మృతి చెందిన ఉద్యోగి శివ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆ ఉద్యోగాన్ని ఆయన భార్య శివలింగమ్మకు కల్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో తెదేపా నాయకులు రామచంద్ర, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి తదితరులు ఉన్నారు. విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామానికి చెందిన తెదేపా నాయకులు కంద్యాల నారాయణస్వామి తదితరులు మంత్రిని కలిసి మాట్లాడారు.


మంత్రి పయ్యావుల కేశవ్‌కు సమస్య విన్నవిస్తున్న తెదేపా నాయకులు

అనంత క్రీడాకారుల ప్రతిభ

రాజానగరం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం సంపత్ నగరం రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఓపెన్ సైట్ కేటగిరీలు ఆదివారం ముగిశాయి. ఈ కేటగిరీలో ఓవరాల్ ఛాంపియన్స్‌గా అనంతపురం, కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాలు నిలిచాయని ఆయన అన్నారు. అండర్-19 బాలికల విభాగంలో.. వైఎస్ఆర్ కడప, కృష్ణా జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. బాలుర విభాగంలో.. అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలు వరుసగా ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించాయి.

నియంత్రికల వద్ద కంపచెట్ల తొలగింపు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని 20 విద్యుత్తు నియంత్రికల వద్ద ఏపుగా పెరిగిన ముళ్లకంపను ఆ శాఖ సిబ్బంది తొలగించారు. ఏఈ బాలచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఈ కార్యక్రమాన్ని చేట్టారు. ముళ్లచెట్లు ఏపుగా పెరిగడంతో గాలి వీచినప్పుడు అవి తీగలకు తగిలి విద్యుత్తు సరఫరాలో అవాంతరాలు ఏర్పడేవి. అత్యవసర సమయాల్లో నియంత్రికల వద్ద మరమ్మతు పనులకు ఇబ్బందులు కలిగేవి. దాంతో సరఫరాను ఆపి కంపచెట్లను తొలగించారు. మిగిలిన నియంత్రికల వద్ద ఉన్న ముళ్లచెట్లను త్వరలో తొలగిస్తామని ఏఈ తెలిపారు.

ఎస్సైకు సత్కారం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బొమ్మనహాళ్ ఎస్సై నబీరసూల్‌ను ఆదివారం తెదేపా నాయకులు శ్యామలమ్మ, కావలి రమానాయుడు, వెంకటరమణ, పీరా తదితరులు కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, జూదం, మట్కా నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.


బస్సుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాలవ, ఆర్టీసీ ఉద్యోగులు

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో మూడు కొత్త బస్సులను ఆయన ప్రారంభించారు. వాటిలో హైదరాబాదుకు రెండు సూపర్ లగ్జరి బస్సులు, శ్రీశైలానికి ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు నడపనున్నారు. డిపోకు ఇప్పటికే 7కొత్త బస్సులు వచ్చాయని, త్వరలో మరో 3 బస్సులు రానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజరు సురేష్‌కుమార్, తెదేపా నాయకులు టంకశాల హనుమంతు, పసుపులేటి నాగరాజు, కౌన్సిలర్లు ప్రశాంతి, బి.జ్యోతి, తెదేపా మహిళా అధ్యక్షురాలు బండిభారతి, సంపత్‌కుమారి, సిమెంట్ శీన, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


కార్తీక్, బృంద సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్థులు

అవార్డు గ్రహీతకు సన్మానం

కంబదూరు, న్యూస్‌టుడే: మండలంలోని నూతిమడుగు గ్రామానికి చెందిన కార్తీక్ మహాశివ లఘు చిత్రానికి గాను ఉత్తమ దర్శకుడిగా ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఒడిశా వారి ఆధ్వర్యంలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆదివారం ఆయనతోపాటు బృంద సభ్యులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామ్మోహన్, రాజగోపాల్, సన్న ఆంజనేయులు, పెద్దఎర్రిస్వామి, భునేంద్ర, సుధాకర్, ముత్యాలు పాల్గొన్నారు.



పశువుల సంత కాదు.. కార్యాలయాలే

కళ్యాణదుర్గం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో పశువులు గుంపులుగా చేరుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాన్ని ఇక్కడే ఉన్నాయి. నిత్యం పలు సమస్యలతో రైతులు, ప్రజలు, విద్యార్థులు వస్తుంటారు. పశువులు ఆవరణలో గుంపులుగా చేరుతున్నాయి. ఒక్కోసారి అవి మీదకు వస్తుండటంతో ఉద్యోగులు, ప్రజలు ప్రాణ భయంతో పరుగులు తీస్తున్నారు. పశువులు రోడ్లు, కార్యాలయాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆయా శాఖల అధికారులను వివరణ కోరగా ఒకరిపై ఒకరు చెప్పుకొంటుండటం గమనార్హం. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

పల్లె దారులు బురదమయం

రాకపోకలకు తప్పని అవస్థలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని కొన్ని కాలనీల్లో రహదారులు బురదతో నిండిపోయాయి. కనీసం అడుగు వేయలేని పరిస్థితి. స్థానిక సాయిభీమా నగర్, వీరశైవనగర్, సీవీవీ నగర్, రామ్‌నగర్‌లలో 600 వరకు నివాస గృహాలు ఉండగా 2400 మందికిపైగా జనాభా ఉన్నారు. కాలనీల్లోని వీధుల్లో అన్ని మట్టి దారులే. అవి కూడా గుంతలు పడ్డాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి, తగిన చర్యలు చేపడతామన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలోని పిల్లిగుండ్ల వద్ద ప్రధాన రహదారిపై మురుగునీరు చేరి, తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. కాలనీల్లోని వృథానీరు ప్రవహిస్తూ, చెత్తాచెదారం చేరి దుర్వాసన వస్తుంది. రోడ్డుపై అడుగు పెట్టలేని పరిస్థితి. వెంటనే శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి, బొమ్మనహాళ్, దర్గాహొన్నూరు, గోవిందవాడ, కల్‌హోళ, బొల్లనగుడ్డం, కొలగానహళ్లి, చంద్రగిరి, ఉద్దేహాళ్, శిద్దరాంపురం, శ్రీధరఘట్ట తదితర గ్రామాల్లో రోడ్లు మురుగుతో నిండిపోయాయి. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. పారిశుద్ధ్యం లోపించినా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై ఈఓఆర్డీ దాసు దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి, పారిశుద్ధ్య పనులు చేయిస్తామని చెప్పారు.


సాయిభీమానగర్‌లో చిత్తడిగా మారిన రోడ్డు


కుందుర్పిలోని పిల్లిగుండ్ల వద్ద మురుగుకూపం


దేవగిరిలో అంగన్‌వాడీ కేంద్రం పేరుకుపోయిన బురద


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి

వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ఉరవకొండ, వజ్రకరూరు, న్యూస్‌టుడే: పేద పిల్లలు వసతిగృహాల్లో ఉండి చదువుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్న వేళ, వాటి నిర్వహణలో వార్డెన్లు నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వొద్దని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి పేర్కొన్నారు. ఆదివారం ఆమె ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లోని బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేశారు. అక్కడి సదుపాయాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా? లేదా? అన్న అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని వార్డెన్లను ఆదేశించారు.

అధిక శబ్దాలతో వాహనాలు నడిపితే జప్తే

నిఘా ఉంచిన పోలీసులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అధిక శబ్దాలు చేసుకుంటూ వాహనాలు నడిపే వారిపై పోలీసులు నిఘా ఉంచారు. ద్విచక్రవాహనాలకు భారీగా శబ్దం వచ్చే సైలెన్సర్లు ఉండటం, ఆటోలకు స్పీకర్లు, ఊఫర్లు ఏర్పాటు చేసుకొని తిరుగుతుండటంతో చర్యలకు ఉపక్రమించారు. పట్టణంలో ఆవిధంగా తిరుగుతున్న కొన్ని ద్విచక్ర వాహనాలను ఇప్పటికే పోలీసులు పట్టుకున్నారు. కొందరు యువకులు ఇలాంటి వాహనాలు నడుపుతుండటంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆటోల్లో పెద్ద సౌండ్‌తో పాటలు పెట్టుకొని ప్రయాణికులను తీసుకెళ్తున్నారనే విషయాన్ని పోలీసులు గమనించారు. ఇలాంటి వాహనాలను ఎక్కడికక్కడే కట్టడి చేయాలని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. పట్టుబడిన వాహనాలను తుక్కు కింద విక్రయించనున్నట్లు చెప్పారు. వాహనదారుల్లో మార్పులు వచ్చేందుకే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నారు.


పోలీసులు పట్టుకున్న వాహనాలు

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించం

డివిజన్ పరిధిలో అధిక శబ్దాలతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడిపితే సహించేది లేదు. ఇప్పటికే అటువంటి నాలుగు ద్విచక్రవాహనాలను పట్టుకొని సీజ్ చేశాం. ప్రజలు సహకరిస్తే పూర్తిస్థాయిలో నిర్మూలిస్తాం. **- రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం**


గురువులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక.. ఆనందాల వేడుక

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలను తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. విందు వినోదాలతో కాలక్షేపం చేశారు. పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటప్రసాద్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు.. పోలీసులకు ఫిర్యాదు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి సామాజిక మాధ్యమాల్లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేశాడని అతనిపై కేసు నమోదు చేయాలని తెదేపా నాయకులు ఆదివారం బ్రహ్మసముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మేనల్లుడు ధర్మతేజపై దుష్ప్రచారం చేశాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, నాయకులు వెంకటేశులు, రామ్మోహన్, వన్నూరుస్వామి, సుభాన్, మల్లికార్జున, ఎర్రిస్వామి, రాము తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


74ఉడేగోళంలో..

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో వాల్మీకి జయంతిని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి ఆ సంఘం అధ్యక్షుడు కేపీ వన్నూరుస్వామి, కరెంటు వన్నప్ప, మాజీ సర్పంచి కేశప్ప, నాగారాజు, ఆర్.రామాంజనేయులు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు.

రాయదుర్గం గ్రామీణం: మండలంలోని 74ఉడేగోళం గ్రామంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అన్నదానాలు చేశారు. సంఘం నాయకులు ఓబన్న, తిప్పేస్వామి, తమ్మయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తం పాల్గొన్నారు.


బొమ్మనహాళ్‌లో పూజలు నిర్వహిస్తున్న వాల్మీకి సంఘ నాయకులు

నిర్మాణం పూర్తయినా.. ప్రారంభమెన్నడో?

కణేకల్లు మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో రైతుసేవా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దాంతో రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మిగిలిపోతున్నాయి. విలేజ్ క్లినిక్ భవనం ప్రారంభించకపోవడంతో 104 సేవలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరీక్షలకు అంతరాయం కలుగుతుంది. గత్యంతరం లేక ఆర్టీటీ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. తప్పని పరిస్థితులలో ప్రారంభించని భవనంలోనే రైతు సేవా కేంద్రం కొనసాగిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రెండు భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కణేకల్లు**



ఇరువర్గాల ఘర్షణ: కేసు నమోదు

విడపనకల్లు(ఉరవకొండ): విడపనకల్లు మండలం పొలికి గ్రామంలో పొలంలో పైపులైన్ విషయంలో ఇరువర్గాలు ఆదివారం ఘర్షణ పడ్డారు. వరుసకు అన్నదమ్ములైన వారి మధ్య మాట మాట పెరిగి, గొడవకు దారితీసింది. ఆరుగురు గాయ పడగా చికిత్స కోసం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజాహుసేన్ తెలిపారు.

జూదరుల అరెస్టు

కూడేరు(ఉరవకొండ): కూడేరు మండలం గొట్కూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ముళ్లపొదల్లో జూదం ఆడుతున్న ఐదుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు. వారి నుంచి రూ.8,170 నగదు, అయిదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

కుంట కాదు.. రహదారే



కళ్యాణదుర్గం-ముదిగల్లుకు వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. అందులో వర్షంనీరు నిల్వ చేరడంతో కుంటలను తలపిస్తుంది. రైల్వే బ్రిడ్జి వద్ద పెద్ద గుంతలు పడటంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు ఇరుక్కుపోతున్నాయి. పలువురు అదుపుతప్పి కిందపడుతున్న సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**


దుగ్గిలమ్మగుడి వద్ద మురుగునీటి మడుగు

దుర్గంలో దోమల దండయాత్ర

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణంలో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో కాలువలు, మురుగునీటి గుంతల్లో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. సాయంత్రమైతే కాలనీల్లో దండయాత్ర చేస్తున్నాయి. శివారు కాలనీల్లో పరిస్థితి దారుణంగా ఉంది. దోమకాటుతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వర బాధితులతో నిండిపోతున్నాయి. వాటి నివారణకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి.

మొక్కుబడిగా ఫాగింగ్: పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ ప్రక్రియ నామమాత్రంగా జరుగుతోంది. తమ ప్రాంతాల్లో నెలల తరబడి ఫాగింగ్ జరగటం లేదని ఆయా వార్డుల ప్రజలు, వార్డు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో గళమెత్తుతున్నారు. స్ప్రేయర్లు కూడా కనిపించటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మురుగు నీటి గుంతల్లో నూనె బంతులు విసరటం, మలాథియాన్ పిచికారీ సక్రమంగా సాగటం లేదు. పురపాలక సంఘంలో దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ కరవైంది. పట్టణంలో 32 వార్డులు ఉండగా కేవలం 4 ఫాగింగ్ యంత్రాలు మాత్రమే ఉన్నాయి. ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈవిషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర వివరణ కోరగా ఫాగింగ్, స్ప్రేయింగ్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిసరాల శుభ్రత, దోమల నివారణపై ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

గుంతకల్లు
•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

అశ్వర్థస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అశ్వర్థనారాయణస్వామి

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని అశ్వర్థ స్వామి ఆలయంలో ఆదివారం సందర్భంగా విశేష పూజలు చేశారు. అశ్వర్థనారాయణస్వామి, శ్రీచక్ర భీమలింగేశ్వరస్వామికి వేదపండితులు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

సంబరంగా జ్ఞాపకాల కలబోత


సమావేశమైన పూర్వ విద్యార్థులు

నార్పల: నార్పల ప్రభుత్వ వసతిగృహంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బొమ్మలాటపల్లి ఎర్రితాత స్వామి ఆలయ ఆవరణలో సమావేశమయ్యారు. వారంతా నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరికొకరు తమ యోగక్షేమాలు తెలుసుకొని సరదాగా గడిపారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుళ్లాయప్ప, లక్ష్మయ్య, వెంకటరాముడు, లక్ష్మీనారాయణ, శివయ్య, సంజప్ప, వెంకటప్ప, సుంకులయ్య, అంకన్న, పెద్దన్న పాల్గొన్నారు.

ఏపీఎస్ఎఫ్ మహాసభల గోడపత్రాల విడుదల

గుంతకల్లు పట్టణం: నవంబరులో 27 నుంచి విజయనగరంలో ఏపీఎస్ఎఫ్ 49వ మహాసభలు జరుగుతాయని నియోజకవర్గ అధ్యక్షుడు వెంకు నాయక్ పేర్కొన్నారు. ఆదివారం గుంతకల్లు బీటీ పక్కీరప్ప భవనంలో జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, కార్యదర్శి కులాయిస్వామి మహాసభలకు చెందిన కరపత్రాలు విడుదల చేశారు.

గుండెపోటుతో ప్రయాణికురాలి మృతి

గుత్తి: గుత్తిలో ఆదివారం ఓ రైలు ప్రయాణికురాలు గుండెపోటుతో మరణించారు. పుణె నుంచి కన్యాకుమారికి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో మహిళా ప్రయాణికుల బోగీలో ఓ ప్రయాణికురాలు(45) మరణించడంతో రైల్వేపోలీసులు మృతదేహాన్ని బోగీలో నుంచి దింపారు. మృతురాలు ఎవరన్నదీ తెలియదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చిన్నారులకు పాముకాటు

గుత్తి: గుత్తి రైల్వే జంక్షన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు చిన్నారులు పాముకాటుకు గురయ్యారు. హుబ్బళ్లికి చెందిన మధు తన భార్య, పిల్లలు నాలుగేళ్ల డియోన్, ఏడేళ్ల మెర్సిన్‌లతో కలిసి గుత్తిఆర్.ఎస్.లోని తమ బంధువుల ఇంటికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో భాగంగా స్వప్రాంతానికి వెళ్లేందుకు గుత్తి రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అక్కడ పిల్లలు ఆడుకుంటుండగా ఓ కట్టకు రంధ్రాలు ఉండటంతో చేయి పెట్టారు. ఇద్దరి పిల్లలకు రక్తం రావడంతో పాము కాటువేసి ఉండవచ్చని తల్లిదండ్రులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పిల్లలకు ప్రాథమిక చికిత్స చేసి అనంతపురానికి తీసుకెళ్లాలని సూచించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురిపై దాడి

గుంతకల్లు గ్రామీణం: కసిరెపల్లి గ్రామంలో పొలం గట్టుపై గడ్డి వేయడంతో చిన్నప్ప, అతని భార్య సునీత, కుమారుడు సుధాకర్‌పై అదే గ్రామానికి చెందిన లాలెప్ప దాడి చేసి గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో చిన్నప్ప పొలంలోని గడ్డిని, కొంత చెత్తను పక్కనున్న లాలెప్ప పొలం గట్టుపై వేశారు. అంతలో అక్కడికి వచ్చిన లాలెప్ప, అతని కుటుంబ సభ్యులు తమపై దాడి చేసినట్లు బాధితులు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుంతకల్లు గ్రామీణం: మండలంలోని గుర్రబ్బాడు గ్రామానికి చెందిన సురేశ్ అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన ఆదివారం జరిగింది. గ్రామానికి బంధయ్య, తిమ్మప్పలు అన్నదమ్ముల పిల్లలు. వీరి పేరిట గ్రామ శివారులో పక్కపక్కనే స్థలాలున్నాయి. కొంత కాలంగా ఇరువురి కుటుంబాల మధ్య వివాదాలు ఉన్నాయి. ఆదివారం ఉదయం బంధయ్య కుమారుడు సురేశ్ వామిరెడ్డి వద్దకు వెళ్లగా అక్కడే ఉన్న తిమ్మప్ప కుటుంబ సభ్యులు మధ్య మాటమాట పెరిగి సురేశ్‌పై దాడి చేసినట్లు తెలిపారు. తిమ్మప్ప అతని కుమారుడు శివారెడ్డి, కోడలు సరస్వతి, వంశీ, హేమంత్‌లు తనపై దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

తాడిపత్రి: తాడిపత్రిలోని కాలువగడ్డ వీధిలో ఓ వ్యక్తిపై దాడి చేశారు. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు కాలువగడ్డ వీధికి చెందిన మౌలాలి, ఆసుపత్రిపాలెంకు చెందిన అయూబ్ గ్యార్మీ పండగ సందర్భంగా వారం కిందట జెండా కర్ర తీసుకొచ్చేందుకు స్థానికులతో కలిసి తిరుపతికి వెళ్లారు. అక్కడ మాటమాట అనుకొని మధ్య పడ్డారు. ఈక్రమంలో అయూబ్ మౌలాలి ఇంటి వద్దకు రాగానే మళ్లీ గొడవకు దిగారు. కోపంలో మౌలాలి కత్తితో దాడి చేసినట్లు చెప్పారు. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వివరించారు.

యువకుడికి తీవ్రగాయాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని వరాలతోట సమీపంలో ఉన్న పెన్నా వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి నరేశ్ తీవ్రంగా గాయపడ్డారు. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు పోరాట కాలనీకి చెందిన నరేశ్ నాపరాళ్ల పరిశ్రమలో పనిచేస్తున్నారు. మద్యం తాగి బుగ్గ వైపు నుంచి ద్విచక్రవాహనంలో తాడిపత్రికి వస్తుండగా పెన్నా వంతెనపైకి రాగానే పక్కనే ఉన్న డివైడర్ ను ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర రక్తగాయాలై అపస్మారక స్థితిలో వెళ్లాడు.

శివారు కాలనీలపై చిన్నచూపు

◆ కనీస వసతులు మృగ్యం ◆ అధికారులకు పట్టని తీరు


బీసీ కాలనీలో ట్యాంకర్‌తో నీటిని పట్టుకుంటున్న స్థానికులు


దాసరికాలనీలో ధ్వంసం అయిన మురుగుకాలువ

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పురపాలిక లోని శివారు కాలనీల్లో ప్రజలు మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో కాలనీల్లో ప్రగతి పనులు పడకేశాయి. ప్రధానంగా కాలువలు, తాగునీటి వసతి లేదు. వీధి దీపాలు లేక రాత్రిళ్లు అంధకారంలో ఉండాల్సి వస్తోంది. ప్రధానంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించిన పురపాలిక అధికారులు వసతులు కల్పించలేకపోయారు.

క్షేత్ర స్థాయిలో ఇదీ పరిస్థితి

● గుత్తి శివారులో ఉన్న వీరారెడ్డి కాలనీ ఏర్పాటై పదేళ్లు గడిచింది. ఇక్కడ తాగునీటి సౌకర్యం లేదు. ఇక్కడి వారంతా తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇది పేదలకు అదనపు భారంగా పరిణమించింది. బిందె నీటిని రూ. 12-15లు వెచ్చించాల్సి వస్తోంది. పురపాలిక అధికారులు బోరు బావి తవ్వించి స్టార్టెజి వరీ ట్యాంకు ఏర్పాటు చేశారు. అందులో ఉప్పునీరు వస్తోంది. వీధిదీపాల ఏర్పాటు పూర్తిస్థాయిలో జరగలేదు.

● కొత్తపేట జగనన్న కాలనీలో 200 కుటుంబాలున్నాయి. ఇక్కడ తాగునీటి సౌకర్యం లేదు. రూ. 25కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదించారు. ఏదాది కిందటే తాగునీటి పథకం మంజూరు కాగా వైకాపా ప్రభుత్వంలో అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు.

● చెట్నేపల్లిలోని కాలనీలో ఉప్పునీటిని అందిస్తున్నారు. ప్రజలు తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. అంతర్గత రోడ్లు లేవు. కాలనీకి వెళ్లేదారి అధ్వానంగా ఉంది. వాగులో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.

● లచ్చానిపల్లి, నేమతాబాదు పరిసరాల్లోని కాలనీల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడా మౌలిక వసతులు కరవయ్యాయి.

● జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ. 11 కోట్లను అమృత్ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు మంజూరై ఏదాది అవుతున్నా గుంతకల్లు ప్రజారోగ్య విభాగం ఇంజినీర్లు పట్టించుకోవడంలేదు. ఇప్పటికీ టెండర్లు నిర్వహించడం లేదు.

● సుందరయ్యకాలనీ, తోళ్లషాపుకాలనీ, పద్మసాలె సామాజిక వర్గం ఉంటున్న కాలనీల్లో వీధి దీపాలు లేవు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పెట్టాం

శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదించాం. ఎస్సీఎస్టీ ఉపప్రణాళిక కింద పనులు ప్రతిపాదించాం. ఆ నిధులతో రోడ్లు, కాలువలు నిర్మించడంతోపాటు తాగునీటి సదుపాయం కల్పిస్తాం. శివారు కాలనీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. - **జబ్బార్ మియా, కమిషనర్, గుత్తి**

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులోని మెయిన్‌రోడ్డులో హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద రహదారిపై గుంతలు పడ్డాయి.
- **రాజు**

సమాధానం: గుంతల రోడ్డుకు మరమ్మతుల చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కౌన్సిల్ ఆమోదంతో పనులు చేపడుతాం.
- **హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు**

- **న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

సమస్య: సలకం చెరువు ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు ఇళ్ల ముందు ప్రవహిస్తోంది.
- **ఆదెమ్మ, సలకంచెరువు**

సమస్య: చిన్న జలాలపురం పాఠశాల పక్కన మురుగు ప్రవహిస్తోంది.
- **ఓబిలేసు, చిన్న జలాలపురం**

సమాధానం: పై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.
- **నిర్మలకుమారి, ఎంపీడీవో**
- **న్యూస్‌టుడే, శింగనమల**

సమస్య: తాడిపత్రిలోని టైలర్స్ కాలనీ ప్రధాన రహదారిపై గతంలో భూగర్భ పైపులైన్ల కోసం గుంత తవ్వి వదిలేశారు.
- **రామ్మోహన్, వాహనదారుడు**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం.
- **తేజ, మున్సిపల్ ఏఈ**
- **న్యూస్‌టుడే, తాడిపత్రి**

మరువవంక నిర్మాణానికి నిధులివ్వండి


ముఖ్యమంత్రికి సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న శింగనమల మరువ వంక వద్ద వంతెన నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విన్నవించారు. ఆదివారం మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి నియోజకవర్గ సమస్యలు తెలిపారు. తుంగభద్ర, శ్రీశైలం నీటితో నియోజకవర్గంలో చెరువులన్నీ నింపాలన్నారు. ముఖ్యంగా మరువ దగ్గర వంతెన నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అనంతరం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి పాదయాత్రలో 800 కిలోమీటర్ల మైలురాయికి గుర్తింపుగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మర్రాడు గ్రామంలో బీసీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని విన్నవించారు.

బురద ఇలా.. నడక ఎలా?



నిత్యం రాకపోకలు సాగించే యాడికి సంతమార్కెట్ వీధి రోడ్డు బురదతో నిండిపోయింది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది. చిన్న వర్షం వచ్చినా సీపీఐ కార్యాలయం, పీహెచ్‌సీ, సచివాలయం-2 వరకు గుంతలు ఏర్పడి నీళ్లు నిలబడిపోతున్నాయి. ఈమార్గం గుండా విద్యాశాఖ కార్యాలయం, సచివాలయం, రైతు కేంద్రం, వారపు సంత, వాహనదేవాలు, వ్యాపారులు, వివిధ కాలనీల ప్రజలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల నుంచి సమస్య ఉన్నా పంచాయతీ అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదని విమర్శిస్తున్నారు. - **న్యూస్‌టుడే, యాడికి**

ఎక్కడపడితే అక్కడ చెత్త

ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకూడదని పురపాలక అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. తాడిపత్రిలోని యల్లనూరు ప్రధాన రహదారి శివరులో విద్యుత్తు నియంత్రిక వద్ద భారీగా వ్యర్థాలు పడేస్తుండటంతో అపరిశుభ్రత నెలకొంది. రెండు వారాల పాటు చెత్తను తొలగించకపోవడంతో దుర్గంధం ఉంటున్న తలెపెత్తి ఇబ్బందిగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. దీనిపై పారిశుద్ధ్య పర్యవేక్షకుడు వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా వెంటనే చెత్తను తొలగించి, ఇంటింటికి వచ్చే పురపాలక వాహనాల్లో వేయాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, తాడిపత్రి**



కరవు నివారణ చర్యలు చేపట్టాలని వినతి

గుంతకల్లు, న్యూస్‌టుడే: జిల్లాలో శాశ్వత కరవు నివారణ పనులను అమలుచేసి జిల్లా ప్రజలను ఆదుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సభ్యులు హరిప్రసాద్, రవి, గోవిందు, మల్లికార్జున, జనవిజ్ఞాన వేదిక గుంతకల్లు మహిళా విభాగం అధ్యక్షురాలు ధరణిలు రాష్ట్ర ఆర్థికమంత్రి కేశవ్‌ను కోరారు. ఆదివారం అనంతపురానికి వెళ్లి మంత్రిని సత్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చెన్నప్ప, సురేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ఉస్మాన్


పవనశ్రీ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్టీటీ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 కబడ్డీ పోటీల్లో మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఉస్మాన్, టార్గెట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలకు చెందిన పవనశ్రీ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల ఆఖరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నటరాజు, జయచంద్ర, తదితరులు తెలియజేశారు.

పల్లెల్లో అభివృద్ధికి అడుగులు


కోటంకలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: కోటంక, మర్తాడు పంచాయతీల్లో ఆదివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం లోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని పలువురు పేర్కొన్నారు. కోటంకలో రూ. 10లక్షలు, మర్తాడులో రూ.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు సర్పంచులు, అధికారులు, తెదేపా నాయకులు భూమి పూజ చేశారు. ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో యోగానందరెడ్డి, ఈవోఆర్డీ దామోదరయ్య, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఏపీవో నాందాదయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఇన్‌స్పెక్టర్ సికిందర్, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, జయరాం, చల్లా నాగరాజు, గోర కాటి వెంకటేశ్ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల పరిధిలో అన్ని గ్రామాల్లో సీసీ రహదారులు ఏర్పాటు చేస్తామని తెదేపా జిల్లా నాయకులు పసుపుల సునీతతో కలిసి సిద్ధరాంపురంలో నూతన రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. దాదాపు రూ.3 కోట్లతో రహదారులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎంపీడీవో సాల్మన్‌రాజ్, ఈవోఆర్డీ సదాశివ, ఏపీవో పోలేరయ్య, అధికారులు మల్లికార్జున, నాగేంద్ర, తెదేపా నాయకులు నారాయణస్వామి పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని పలు పంచాయతీల్లో ఈనెల 14 నుంచి నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమం ఆదివారం క్రిష్టిపాడుతో ముగిసింది. పంచాయతీరాజ్ డీఈ రమేశ్‌కాంత్ రెడ్డి, ఏపీవో పుల్లారెడ్డి, గృహనిర్మాణశాఖ ఏఈ నెట్టికంటయ్య, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు పేక్కావలి, రామాంజనేయులు, వైద్య ఆరోగ్య ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ శిబిరం

పామిడి: ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డు సచివాలయం, పామిడి పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపీడీఓ తేజోత్స్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ ప్రతి ఒక్కరికీ అవసరమన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

మెగా రక్తదాన శిబిరం నేడు

యాడికి: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయలచెరువులో సోమవారం లయన్స్ క్లబ్, ఆర్టీటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు చల్లా సూర్యనారాయణ తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణదాతలుగా నిలుస్తారని, ఆసక్తి ఉన్నవారు రక్తదానం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ పండగ


అలంకరణలో దస్తగిరి స్వామి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణ పరిధి రాల్లోని 22-కేవీ సబ్‌స్టేషన్ వెనకాల ఉన్న దస్తగిరి కట్ట వద్ద గ్యార్మీ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో దస్తగిరి స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. అనంతరం జెండా కట్ట వద్ద 1500 మందికి అన్నదానం చేశారు. ముందుగా జెండాను గ్రామంలో ఊరేగించారు.

ఆత్మవిశ్వాసంతో రాణిస్తేనే విజయాలు


జిల్లా జట్లకు ఎంపికైన బాలబాలికలు

ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు రాజేశ్, మారుతి, ప్రభాకర్, రామ్మూర్తి పాల్గొన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 26 నుంచి మూడురోజుల పాటు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పుల్లారెడ్డి తెలిపారు.

జట్లకు ఎంపికైన క్రీడాకారులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగి సత్తాచాటితే విజయాలు సులభంగా వరిస్తాయని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు లక్ష్మయ్య, ఖోఖో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారెడ్డి అన్నారు. కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఖోఖో బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక జరిగింది. ఎంపిక పోటీల్లో జిల్లాలోని నలుమూలల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. ఒక్కొక్క జట్టుకు 16 మందిని ఎంపిక చేశారు. బాలుర జట్టుకు నవీంద్ర, అశోక్, కార్తిక్, అనిల్‌కుమార్, జె.కార్తిక్, నాగేంద్ర, భరత్‌కుమార్, వలి, హరికృష్ణ, నరేంద్రకుమార్, జ్యోతిరాం, వరుణ్‌కుమార్, వరుణ్, సుశాంత్, చరణ్, అశోక్‌కుమార్ ఎంపికయ్యారు. బాలికల జట్టుకు రామలక్ష్మి, జయమాలిని, మౌనిక, హబీబా, జ్యోతి, తేజస్విని, సిరీష, కౌసల్య, సుఫియా, రసీదా, సాహితి, అర్జున్, స్వప్న, అంజలి, స్వర్ణ, అంజలిని ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గుంతకల్లులోని బీటీ పక్కీరప్ప భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మేరకుపోయిన సమస్యలు అలాగే ఉండిపోయాయన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, గత ప్రభుత్వంలో అనేక ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. అధ్యక్ష, కార్యదర్శులు సురేశ్, ఈశ్వరయ్య, పాల్గొన్నారు.

రఘునాథపురంలో దానిమ్మ కాయల చోరీ

శింగనమల: రఘునాథపురానికి చెందిన రామిరెడ్డి అనే రైతుకు చెందిన తోటలో దానిమ్మ కాయలను శనివారం రాత్రి చోరీ చేశారు. తోటకు వెళ్లి పంటను చూసిన రైతు చెట్లకు కాయలు లేకపోవడంతో లబోదిబోమన్నారు. తోటలోని దానిమ్మ కాయలను రాత్రి కోత కోసి వాహనంలో తరలించినట్లు బాధిత రైతు వాపోయారు. దాదాపు రూ.9లక్షలు విలువ చేసే కాయలను దోచుకెళ్లినట్లు రైతు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శరత్‌చంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మృతికి సంతాపం

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పులగుట్టపల్లి గ్రామ సర్పంచి పార్వతి భర్త వెంకటేశ్ నాయక్(46) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. తెదేపా నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి మృతుడికి అంజలి ఘటించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 10 వేలను ఆర్థిక సాయం అందజేశారు.

లయన్స్‌క్లబ్ ఏర్పాటు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో పోర్ట్ లయన్స్ క్లబ్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. కమిటీ సమావేశాన్ని విరూపాక్షరెడ్డి ఫంక్షన్ హాలులో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా వెంకటప్ప, కార్యదర్శిగా మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు సేవలు అందిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రహదారి పనుల్లో జాప్యం


అధ్వానంగా రాయలచెరువు-చందన రోడ్డు

యాడికి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులపై ఏమాత్రం శ్రద్ధ వహించకపోవడంతో నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆర్ కి.మీ.ల రహదారి నిర్మాణానికి ఐదేళ్ల గడిచినా ఒక్క మీటర్ దూరం పనులకు కూడా నోచలేదు. అడుగడుగునా గుంతలు పడిన రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టలేదు. వైకాపా ప్రభుత్వ పాలన ముగుస్తున్న సమయంలో ఆఘమేఘాల మీద టెండర్లు వేసి పనులకు శ్రీకారం చుట్టారు. టెండరు దక్కించుకున్న ఓ గుత్తేదారు పనులు ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపుల రెండు అడుగుల లోతులో మట్టిని తొలగించారు. పాలన కాస్త ముగిసిపోవడంతో గుత్తేదారు పనులు ఆపేశారు. వర్షాల వల్ల గుంతల్లో నీళ్లు నిలబడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

భయం భయంగా ప్రయాణం

ప్రజలు రాత్రి, పగలు రాకపోకల సమయాల్లో భయంభయంగా ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. యాడికి మండలంలోని రాయలచెరువు-దైవాలమడుగు గ్రామాల మధ్య ఆరుగురో గుంత ఉంది. పలుమార్లు రహదారులు, భవనాలశాఖ అధికారులకు విన్నవించినా ఫలితం కానరావడం లేదని జనం ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు నిర్మాణంపై ప్రజల్లో ఆశలు చిగురించాయి.

● రాయలచెరువు నుంచి చందన మీదుగా దైవాలమడుగు వరకు ఆర కి.మీ.ల మేరకు తారు రోడ్డు నిర్మాణానికి ఏడీబీ నిధుల కింద రూ. 9.25 కోట్లు మంజూరు చేశారు.

వారంలో ప్రారంభానికి చర్యలు

చందన రోడ్డు పనులు ఆపేసి చాలా రోజులవుతోంది. టెండరు పొందిన గుత్తేదారు ఆలస్యం చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. - **సత్యనారాయణ, రహదారులు, భవనాలశాఖ డీఈ, గుత్తి**

పాఠశాల స్థలం కాపాడండి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమణల చెర నుంచి కాపాడాలని సీపీఎం నాయకులు ఓ.నల్లప్ప డిమాండు చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కిందట దేవరకొండ వద్ద 5 ఎకరాల స్థలం కేటాయించారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో పాఠశాల నిర్మాణానికి నిధులు కేటాయించలేదన్నారు. కొందరు వ్యక్తులు పాఠశాల స్థలంలో ఆరు సెంట్లలో గుడిసెలు వేసుకుంటున్నారన్నారు. వాటిని తొలగించి పాఠశాల భవనాన్ని నిర్మించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినమైన చర్యలు తప్పవని ఎస్సై గౌస్‌బాషా హెచ్చరించారు. ఆదివారం రాత్రి ముకుందాపురం, యర్రగుంట్ల గ్రామాల్లో పర్యటించి గ్రామసభల్లో శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

శిథిలావస్థలో పశువైద్యశాల


యర్రగుంట్ల పశువైద్యశాల


గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల పరిసర గ్రామాల పాడి పశువులకు సేవలందిస్తున్న పశువైద్యశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఉపకేంద్రం పరిధిలో 5,200 పశువులు, 16వేల గొర్రెలు ఉన్నాయి. ముకుందాపురం, పెనకచెర్ల, డ్యామ్, కొప్పలకొండ, కేశవాపురం, కమలాపురం, కొట్టాలపల్లి, కె.కె.తండా, బూదేడు, సంజీవపురం, కృష్ణాపురం గ్రామాల నుంచి పశువులను ఇక్కడికి తీసుకొచ్చి రైతులు వైద్యం చేయిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షం వస్తే కారుతోంది. దీంతో చికిత్సలు చేయలేకపోతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా కొత్తగా ఆసుపత్రి నిర్మించడానికి మంజూరు నిధులు చేశారు. భవన నిర్మాణానికి స్థలం లేకపోవడంతో కలగానే మిగిలిపోయింది. ప్రస్తుతం ఉన్నతాధికారులు స్పందించి నూతన పశువైద్యశాలను నిర్మించాలని పాడి రైతులు కోరుతున్నారు.

స్థలం కొరతతో ఆగిపోయింది

శిథిల భవనంలో విధులు నిర్వర్తిస్తున్నాం. నూతన భవనం మంజూరైనా స్థలం కొరతతో ఆగిపోయింది. స్థలం కోసం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రజాప్రతినిధులు, ప్రజలు స్పందించి స్థలం కేటాయించాలి. నూతన భవనం నిర్మిస్తే ఇబ్బందులు తప్పుతాయి. - **అంజినాయక్, పశువైద్యాధికారి, యర్రగుంట్ల**

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు



త్యాగరాజ నృత్య వేడుకలకు అంకురం

అశోక్‌నగర్: త్యాగరాజ సంగీత సభ ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత నృత్య వేడుకలను అంకురం పేరుతో ప్రారంభించారు. ఆదివారం రాత్రి హెచ్ఎల్‌సీ కాలనీలో ఉన్న శ్రీత్యాగరాజ సంగీత సభ వేదిక వద్ద అంకుర శాస్త్రీయ నృత్య వేడుకలను ప్రారంభం అయ్యాయి. కూచిపూడి నృత్యకారిణి అలా వేణుగోపాల్ శాస్త్రీయ నృత్యంతో అబ్బుర పరిచారు. గతంలో కొద్ది రోజుల పాటు కార్యక్రమాలు ఆగిపోగా మళ్లీ ప్రారంభం కావడంతో పలువురు ఆనందం వ్యక్తంచేశారు. త్యాగరాజ సంగీత సభ వ్యవస్థాపకులు జ్ఞానేశ్వరరావు, సంపత్‌కుమార్, చిన్మయ మిషన్ స్వామి ఆత్మ విదానంద, ఎస్కేయూ పూర్వపు రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి గుర్తింపు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషను పరిధిలో అదృశ్యమైన బాలుడిని పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. నగర శివారు ఎస్ఆర్ పాఠశాలలో ఇటుకలపల్లికి చెందిన ఓ విద్యార్థి చదువుతున్నాడు. ఆదివారం సదరు బాలుడు వసతి గృహం నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చాడు. తాతకి ఫోన్ చేసి తాను ఎక్కడికో వెళ్లిపోతున్నానని చెప్పాడు. కంగారు పడిన తాత బాలుడి తల్లిదండ్రులకు తెలిపాడు. వారు నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి బాలుడి ఆచూకీ కోసం గాలించారు. కందుకూరు గ్రామం వద్ద బాలుడు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతని తల్లిదండ్రులకు అప్పగించారు.

అస్తవ్యస్తంగా మురుగు



నగరంలోని సప్తగిరి కూడలి వద్ద కాలువ అస్తవ్యస్తంగా తయారైంది. కాలువలో చెత్తాచెదారం పడి మురుగు నీరు ముందుకు కదలడం లేదు. వర్షం కురిసినపుడు రోడ్డు పైకి చేరి దుర్వాసన రావడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, అనంతపురం (కమలానగర్)

రోడ్డు నిర్మాణ పనులు జరిగేనా?



గత వైకాపా పాలనలో మదిగుబ్బ- వడ్డుపల్లి గ్రామాల మధ్య 5 కిలోమీటర్ల మేర రూ.2 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అయితే రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. కేవలం మట్టి రోడ్డు వేసి మమ అనిపించారు. వర్షాలకు మట్టికొట్టుకుపోయి రాళ్లు తేలుతున్నాయి. తిరిగి మొదటి నుంచి పనులు చేపట్టాల్సి వస్తోంది. – న్యూస్‌టుడే, ఆత్మకూరు

పట్టపగలే వెలుగులు



అనంతపురం రూరల్ పరిధి పంగల్‌రోడ్డు నుంచి ఆర్డీటీ స్టేడియం వరకు గల ప్రధాన రహదారిపై పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్ అధికారులు పర్యవేక్షణ కరవైంది. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండంతో వందలాది యూనిట్ల విద్యుత్తు వృథా అవుతుంది. – న్యూస్‌టుడే, రాప్తాడు

అడుగడుగునా గుంతలే..



రోడ్లు అస్తవ్యస్తంగా మారి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రయాణం మరింత కష్టతరమవుతుంది. ప్రసన్నాయపల్లి పంచాయతీ కళాకారుల కాలనీ నుంచి అనంతపురం ప్రధాన రహదారికి వెళ్లే దారి అడుగు అడుగునా అడుగు లోతు గుంతలు ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – న్యూస్‌టుడే, రాప్తాడు

ఆదమరిస్తే షాకే...

వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పంట పొలాల్లో స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారుతున్నా, విద్యుత్తు తీగలు చేతి కందే ఎత్తులో ఉన్నా పట్టించుకునే వారే కరవయ్యారు. రాప్తాడు మండలం బుక్కచెర్ల గ్రామం పరిధిలో కనిపించిన దృశ్యాలివి. – ఈనాడు, అనంతపురం



బుక్కచెర్ల- కాట్నేగానికాల్వ రహదారిలో పొలం గట్లపై ఒరిగిన విద్యుత్తు స్తంభాలు



బుక్కచెర్ల గ్రామంలో అరటితోట పక్కనే తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు తీగలు

యథేచ్ఛగా ఉల్లంఘన..

సవాలుగా ట్రాఫిక్ నియంత్రణ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ ప్రహసనం లాంటిది. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలను వాహనదారులు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఇరుకు రోడ్లు, వాహనదారులు స్వయం నియంత్రణ లేకపోవడం కారణంగా రోజురోజుకూ రద్దీ నియంత్రణ సంక్లిష్టంగా మారుతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● అనంతపురంలో ప్రస్తుతం ఇరవైకి పైగా ట్రాఫిక్ పాయింట్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. గడియార స్తంభం, నడిమివంక, సప్తగిరి, శ్రీకంఠం, ఐరన్ బ్రిడ్జి, కళ్యాణదుర్గం, బళ్లారి, రుద్రంపేట కూడళ్లలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటోంది. ఇక్కడే ఎక్కువగా నిబంధనలను ఉల్లంఘన జరుగుతోంది.

● గడియార స్తంభం వద్ద గుల్జార్‌పేట వైపునకు వెళ్లే వారు ఎక్కువగా రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేస్తున్నారు. కోర్టురోడ్డు వైపునకు వెళ్లే వారు ఇష్టారాజ్యంగా అపసవ్య దిశలో వెళ్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాయి. నడిమి వంక వద్ద ఒకటో రోడ్డు నుంచి ఐదో రోడ్డు వరకు వున్న వాహనదారులు కళ్యాణదుర్గం, బళ్లారి సర్కిల్ వైపునకు వెళ్లేవారు బ్రిడ్జి కింద వెళ్లకుండా ఆజాద్‌నగర్ సర్కిల్ మీదుగా అడ్డంగా వెళ్తున్నారు.



పాతూరులోని తాడిపత్రి బస్టాపు వద్ద ట్రిబుల్ రైడింగ్‌లో యువకులు

● ట్రాఫిక్ పోలీసులు తరచూ జరిమానా వేస్తున్నా కొందరిలో మార్పు రాలేదు. పోలీసులు యాప్‌ ద్వారా వేసే ఫైన్ ఆన్‌లైన్ చెల్లింపులు ఉండటం వల్ల చాలా మంది సీరియస్‌గా తీసుకోవడం లేదు. అధికశాతం మంది ఫైన్లను లెక్కచేయడం లేదు. ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, నో పార్కింగ్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా బండి నడిపిన వారికి జరిమానాలు విధిస్తున్నారు.

● 2023లో 13,915 కేసులు నమోదు చేసి రూ.41.07 లక్షలు, అలాగే 2024 అక్టోబరు 17వ తేదీ వరకు 10,510 కేసులు నమోదు చేసి రూ.35.90 లక్షల జరిమానాలు విధించారు. ఈ జరిమానాల్లో ఇరవై శాతం కూడా చెల్లించలేదు. రెండో సారి పోలీసులకు వాహనాలు పట్టుబడినపుడు జరిమానా విధించినా సిబ్బందిపై ఒత్తిడి చేసి తప్పించుకుంటున్నారు.



గడియార స్తంభం వద్ద ప్రమాదకరంగా రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనదారులు

పంచసూత్రాలు పాటిస్తే క్షేమం

ప్రాణాపాయం కల్గకుండా హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. మద్యం తాగి వాహనాన్ని నడపకూడదు. అతివేగం, ముందు వాహనలను అధిగమించడం వల్ల పక్క వారిని కూడా ప్రమాదంలోకి నెట్టినట్లే. వాహనం నడిపేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ చరవాణిలో మాట్లాడరాదు. ట్రాఫిక్ నియంత్రణకు నగర ప్రజలు సహకరించాలి.

– రఘుప్రసాద్, సీఐ, అనంతపురం ట్రాఫిక్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: అంబేడ్కర్ నగర్‌లో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. చిన్న పిల్లలతో వెళ్లలేని పరిస్థితి ఉంది. **-హేమ**

సమాధానం: కుక్కల తరలింపుపై తగు చర్యలు తీసుకుంటాం.

సమస్య: రాంనగర్ 80 అడుగుల రోడ్డులో చెత్త తొట్టె ఉన్నా చెత్త కింద పడేస్తున్నారు. **- సాయి**

సమాధానం: చెత్త బిన్నులో వేయకుండా క్లాప్ ఆటోలు వచ్చినప్పుడు అందులో వేసేలా అవగాహన కల్పిస్తాం

(పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు.) – న్యూస్‌టుడే, అశోక్‌నగర్

అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్

అనంత క్రీడాకారుల ప్రతిభ

రాజానగరం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం సంపత్ నగరం రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఓపెన్ సైట్ కేటగిరీలు ఆదివారం ముగిశాయి. ఈ కేటగిరీలో ఓవరాల్ ఛాంపియన్స్‌గా అనంతపురం, కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాలు నిలిచాయని ఆయన అన్నారు. అండర్-19 బాలికల విభాగంలో.. వైఎస్ఆర్ కడప, కృష్ణా జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. బాలుర విభాగంలో.. అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలు వరుసగా ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించాయి.

గ్లోబల్ టూరిజం పురస్కారం అందజేత

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: అనంతపురానికి చెందిన సామాజిక సేవకుడు అనిల్‌కుమార్ గ్లోబల్ టూరిజం అవార్డు-2024 అందుకున్నారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని తాజ్‌డెక్కన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన అనంతపురం నగరం శివారు బుక్కరాయసముద్రం వద్ద ఉన్న శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన కోనేరు అపరిశుభ్రత, శిథిలావస్థకు చేరుకోవడంతో 2020లో ఏడు రోజుల్లో పునరుద్ధరించారు. బోరు వేయించి కోనేరును మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చారు. చారిత్రక నిర్మాణాన్ని పునరుద్ధరించడంతో ఈ గుర్తింపు దక్కింది.



అవార్డు అందుకుంటున్న అనిల్‌కుమార్

అనంత గ్రామీణ సీఐగా శేఖర్ బాధ్యతలు



అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎట్టకేలకు అనంతపురం గ్రామీణం సర్కిల్‌కు నూతన సీఐని ప్రభుత్వం నియమించింది. అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎన్.శేఖర్ ఆదివారం గ్రామీణం స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. 2009లో ఎస్సైగా ఎంపికై ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని అనంత వన్‌టౌన్, తాడిమర్రి, నార్పల, హిందూపురం, ట్రాన్స్‌కోలో పనిచేశారు. సీఐగా ఉద్యోగోన్నతి పొంది అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ స్టేషనుకు రావడానికి పదుల సంఖ్యలో పోటీ పడ్డారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు.

కందుకూరులో వాల్మీకి జయంతి



అనంతపురం రూరల్ కందుకూరులో మహర్షి వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పూజలు నిర్వహించారు. కందుకూరులో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, రాప్తాడు



కుంటిమద్ది చెరువు వద్ద పరిటాల సునీత, నాయకులు

చెరువులకు హంద్రీనీవా జలాలు: సునీత

రామగిరి: రాప్తాడు నియోజకవర్గానికి హంద్రీనీవా నీటిని తెచ్చిన ఘనత తెదేపాకే దక్కుతుందని సునీత అన్నారు. ఆదివారం రామగిరి మండలం కుంటిమద్ది చెరువులో నిర్వహించిన గంగపూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆమెతోపాటు మనవడు జూనియర్ పరిటాల రవీంద్ర కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చెరువు నిండి ప్రవహిస్తుంటే రైతుల్లో ఆనందం కనిపిస్తోందన్నారు.

● రామగిరి మండలం గంగంపల్లి తండాకు చెందిన శ్రీకాంత్ ఇటీవల అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చేరారు. ఆరోగ్యశ్రీ కార్డుతో ఆసుపత్రిలో చేరినా, డబ్బులు చెల్లిస్తేనే ఆపరేషన్ చేస్తామని డిమాండ్ చేయడంతో చేసేదిలేక రూ.30,000 కట్టామని బాధితులు వాపోయారు. శనివారం పల్లె పండుగ కార్యాక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేతో బాధితురాలు ఫిర్యాదు చేశారు. స్పందించి ఎమ్మెల్యే డీఎంహెచ్‌ఓతో చరవాణిలో మాట్లాడి ఎందుకు డబ్బులు కట్టించుకున్నారో పరిశీలించాలన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత ఎస్ఎస్‌బీఎన్ జట్టు

• బ్యాడ్మింటన్ విజేతగా ఆర్ట్స్ కళాశాల

అనంతపురం క్రీడలు : ఎస్కేయూ అనుబంధ అంతర్ కళాశాలల బి-గ్రూప్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల జట్టు సొంతం చేసుకుంది. ఆదివారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల సిమెంటు కోర్టులో జరిగిన ఫైనల్ పోటీలో ఆ జట్టు ఎస్కేయూ కళాశాల జట్టుపై 74-21 పాయింట్ల తేడాతో అలవోకగా నెగ్గింది. అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్ జట్టు 15 సార్లు ఛాంపియన్‌షిప్ టైటిల్ అందుకోవడం విశేషం. ఆట ప్రారంభం నుంచి ఎస్ఎస్‌బీఎన్ ఆటగాళ్లు అద్భుతంగా ఆడారు. డ్రిబ్లింగ్, డిఫెన్స్, ఫ్రీత్రోలతో ప్రత్యర్థి జట్టును చిత్తుచేశారు. అనేకసార్లు ఫైనల్లో ఎస్ఎస్‌బీఎన్, ఆర్ట్స్ కళాశాల తలపడ్డాయి. ఎస్ఎస్‌బీఎన్ జట్టు ఎక్కువ పర్యాయాలు విజేతగా నిలిచి రికార్డు సృష్టించింది. ఎస్కేయూ కళాశాల జట్టు తొలిసారి ఫైనల్‌కు చేరినా ట్రోఫీ అందుకోలేక చతికిలబడింది. బ్యాడ్మింటన్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల జట్టు విజేతగా నిలవగా రెండోస్థానాన్ని ఎస్ఎస్‌బీఎన్ జట్టు కైవసం చేసుకుంది. కబడ్డీ ఫైనల్‌కు ఎస్ఎస్‌బీఎన్, ఆర్ట్స్ కళాశాల జట్లు చేరుకున్నాయి. ఫైనల్ పోటీ సోమవారం నిర్వహించనున్నట్లు టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.



టైటిల్ అందుకున్న ఎస్ఎస్‌బీఎన్ కళాశాల జట్టు

రైతు సమస్యలపై ప్రత్యక్ష పోరుకు సిద్ధం

అశోక్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యక్ష పోరుకు సిద్ధం అవుతామని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇసుక, మద్యంపై ఉన్న శ్రద్ధ రైతులపై కూటమి ప్రజాప్రతినిధులకు లేకపోవడం దారుణం అన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలు, రైతులను మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తుంగభద్ర, హంద్రీనీవా నీటి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. కాలువల మరమ్మతులు వెంటనే చేపట్టి జిల్లాలోని అన్ని చెరువులను నింపాలని డిమాండ్ చేశారు.

పాఠశాల స్థలం కాపాడండి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమణల చెర నుంచి కాపాడాలని సీపీఎం నాయకులు ఓ.నల్లప్ప డిమాండు చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కిందట దేవరకొండ వద్ద 5 ఎకరాల స్థలం కేటాయించారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో పాఠశాల నిర్మాణానికి నిధులు కేటాయించలేదన్నారు. కొందరు వ్యక్తులు పాఠశాల స్థలంలో ఆరు సెంట్లలో మార్కింగ్ వేసి పునాదులు తవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

ఆవోపా నగర నూతన కార్యవర్గం ఎంపిక

అశోక్‌నగర్ : ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) నగర అధ్యక్షుడిగా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆదివారం అనంతపురంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎంపికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా బద్రీనాథ్‌లను ఎంపిక చేసుకున్నారు.


పాత పెన్షన్ విధానం అమలు చేయాలని వినతి

ఎస్కేయూ : 2003- డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉపాధ్యాయ ఫోరం నాయకులు కోరారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయ ఫోరం ప్రతినిధులు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. కేంద్రం జారీ చేసిన 57 మెమో ప్రకారం ఓపీఎస్ అమలు చేయాలని కోరారు.

‘జిల్లా సాహితీ లోకానికి వరం జానమద్ది’

అనంత సాహితీవేత్తకు పురస్కారం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: జిల్లా సాహితీ లోకానికి డాక్టరు జానమద్ది హనుమచ్ఛాస్త్రి వరం లాంటి వారని, ఆయన తెలుగు భాషా సాహిత్యాల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని, సీపీ బ్రౌన్ పేరిట స్మారక గ్రంథాలయాన్ని నిర్మించడానికి అహర్నిశలు శ్రమించారని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ పేర్కొన్నారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలు, గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గండ్లూరి దత్తాత్రేయ శర్మలకు గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మాట్లాడుతూ హనుమచ్ఛాస్త్రి చేసిన సేవలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏటా సాహిత్య, గ్రంథాలయ సేవకులను పురస్కారంతో గౌరవించడం అభినందనీయమన్నారు. జానమద్ది రచయితగా సాహితీ సేవ చేస్తూనే మరోవైపు బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి తుదిశ్వాస వరకు కృషి చేశారని కొనియాడారు.



గండ్లూరి దత్తాత్రేయశర్మను సత్కరిస్తున్న జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, ఎమ్మెల్యే, మండలి బుద్ధప్రసాద్, తదితరులు

శివారు.. సమస్యలతో బేజారు!

మారుతీనగర్ (అనంత నగరపాలక), న్యూస్‌టుడే: శివారు ప్రాంతాల్లో సమస్యలు తిష్ఠ వేస్తున్నా అధికార యంత్రాంగానికి పట్టింపు లేదు. ప్రధానంగా మారుతీనగర్ ప్రాంతంలో పారిశుద్ధ్యం పడకేసింది. మారుతీనగర్ రెండో క్రాస్‌లో ఖాళీ ప్రదేశం డంపింగ్ యార్డును తలపిస్తోంది. అపరిశుభ్రం, పారిశుద్ధ్యం లోపంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది.

డంపింగ్ యార్డులాగా ఖాళీ ప్రదేశం



మారుతీనగర్ శివారులో టెన్నిస్ కోర్టు వద్ద ఖాళీ ప్రదేశం డంపింగ్ యార్డును తలపిస్తోంది. ప్రజలే కాదు నగరపాలక పారిశుద్ధ్య సిబ్బంది ఇక్కడే చెత్తను వేస్తున్నారు. చెత్తను అలానే వదిలేయడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షం వస్తే ప్రధాన రోడ్డుతో పాటు కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో మురుగు నిలబడుతోంది.

వంతెన కట్టి ఛాంబర్ వదిలేసి!



మారుతీనగర్‌లో వంతెన నిర్మాణం చేపట్టక ముందు రైల్వే గేటు నుంచి కింద వెళ్లే వారు. అప్పట్లో వర్షం వస్తే నీరు సక్రమంగా వెళ్లేది. వంతెన నిర్మాణం చేపట్టిన అనంతరం సరైన పారిశుద్ధ్య విధానాలు అమలు చేయలేదు. కేవలం చిన్న కాలువ మాత్రమే ఉండటంతో పలు ప్రాంతాల నుంచి వచ్చే నీరంతా వంతెన చివరలో రోడ్డు దాటి క్రీసెంట్ పాఠశాల వెనుక వైపున వెళ్లాల్సి ఉంది. ఇక్కడ కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పోయింది. ఛాంబర్ ఏర్పాటు చేయక పోవడంతో కొద్ది పాటి వర్షం వస్తే చాలు మురుగు నిలుస్తోంది.

ఆడేందుకు మైదానమేదీ?

• సర్కారు పాఠశాలల్లో దుస్థితి

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యతోపాటు ఆటలు కూడా నేర్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అనంతపురం గ్రామీణం ప్రభుత్వ పాఠశాలల్లో ఆట స్థలాల్లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. ప్రతి పాఠశాలకు పీఈటీ ఉపాధ్యాయులను కూడా నియమించారు. వైకాపా ప్రభుత్వంలో ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలోకి విలీనం చేశారు. ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాలు ఉన్నాయా? లేదా అన్నది కూడా చూడకుండా తరగతులను విలీనం చేయడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో 3-10 తరగతుల వరకు చదువు అందిస్తున్నామని, ఆటలు ఆడించడం కష్టమవుతోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలలు సమీపంలో ఉన్న ప్రైవేటు ఖాళీ స్థలాలను సొంత ఖర్చులు వెచ్చించి చదును చేసుకుని ఆట స్థలాలుగా ఏర్పాటు చేసుకున్నారు. స్థల యజమానులు ఎప్పుడు వదలమంటారో అన్న బెంగ ఉపాధ్యాయులను వెంటాడుతోంది.

పీఈటీ ఉపాధ్యాయుడు ఉన్నా..

అనంతపురం గ్రామీణం పాపంపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణంలో ప్రాథమిక పాఠశాల ఉంది. పాఠశాల చుట్టు ఇళ్లున్నాయి. గత వైకాపా ప్రభుత్వం 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలోకి విలీనం చేసింది. ఉన్నత పాఠశాలలో మొత్తం 3-10వ తరగతి వరకు 595 మంది విద్యార్థులు, ప్రాథమిక పాఠశాలలో 1-2 తరగతుల్లో 20 మంది విద్యార్థులున్నారు. ఉన్నత పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడు ఉన్నా. పిల్లలు ఆటలకు మైదానం లేదు. విద్యార్థులు చదువుల్లో రాణిస్తున్నా ఆటలు ఒక్క ఆట కూడా ఆడించలేని పరిస్థితిలో ఉన్నామని ఉపాధ్యాయులు వాపోతున్నారు.



అప్‌గ్రేడ్ చేసి.. వదిలేసి

అనంత గ్రామీణం పిల్లిగుండ్ల కాలనీలో ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. 1-8 తరగతి వరకు మొత్తం 430 మంది విద్యార్థులున్నారు. 2013లో ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. 2019-20లో వైకాపా ప్రభుత్వం డెమో పాఠశాలగా రూ.కోటి వెచ్చించి ఆకర్షణగా నిర్మించారు. ఆటలకు మైదానం లేదు. ఆటలు నేర్పించలేకపోతున్నామని ఉపాధ్యాయులు వాపోతున్నారు.





ప్రైవేటు స్థలమే దిక్కు

అనంతపురం గ్రామీణం విద్యారణ్యనగర్‌లో ప్రాథమికోన్నత, ప్రాథమిక ఉర్దూ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఒకేచోట ఉన్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలలో 1-8వ తరగతి వరకు 185 మంది, ఉర్దూ పాఠశాలలో 1-5వ తరగతి వరకు 60 మంది విద్యార్థులు, ప్రాథమికోన్నత పాఠశాలను 1986లో 5-8వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారు. పాఠశాల భవనాల కొరత లేదు. 8 ఉపాధ్యాయులు ఉన్నారు. అవగాహన లేక పాఠశాల ఆవరణం మధ్యలో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. ఆట స్థలం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల పక్కనున్న ప్రైవేటు స్థలం చదును చేసుకుని విద్యార్థులు ఆడుకుంటున్నారు.

ఎమ్మెల్యే అనుచరులమంటూ హల్‌చల్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ‘మద్యం మత్తులో ఉన్న కొందరు తాము అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులమంటూ హల్‌చల్ చేసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి సిబ్బందికి, జిల్లాలోని ప్రజాప్రతినిధి అనుచరులకు కొంతకాలం క్రితం గొడవలు జరిగాయి. గత శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్ వద్ద ఇరువర్గాల వారు ఎదురుపడ్డారు. కొందరు తామంతా అధికార పార్టీకి చెందిన వారమని కేకలు వేస్తూ ఘర్షణకు దిగారు. సమాచారం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాల వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు.

టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం కొత్త కార్యవర్గం

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరులోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల అధికారి సీహెచ్.నాగభూషణం, సహాయ ఎన్నికల అధికారి పి.శివరామకృష్ణ ఫలితాలు ప్రకటించారు. ● రాష్ట్ర అధ్యక్షుడిగా జి.మోహన్‌గోపాలకృష్ణ (రాష్ట్ర సచివాలయం), ప్రధాన కార్యదర్శిగా బి.సి.శంకర్‌నాయక్ (కర్నూలు జిల్లా) ఉపాధ్యక్షులుగా బి.చిన్నారావు (పశ్చిమ గోదావరి), బి.బ్రహ్మానందరెడ్డి (కర్నూలు), వి.చంద్రశేఖర్ (గుంటూరు), మహమ్మద్ జాకిర్ (అనంతపురం), కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్ఎస్‌కే శర్మ (నెల్లూరు), జి.ప్రాణేష్‌రావు (అనంతపురం), వి.రామకృష్ణ (కృష్ణా), కె.మురళి (ప్రకాశం) ఎన్నికయ్యారు.